ANN తెలుగు

Follow: @ANNTELUGU

20-01-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 25 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



అట్టహాసంగా మేడారం ఆలయ ప్రాంగణం

## పునఃప్రారంభం

**మహా జాతరను లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**ఆలయం చుట్టూ ఆకట్టుకుంటున్న గిరిజన శిల్పాలు**

**దావోస్ కు వెళ్ళిన ముఖ్యమంత్రి**

**మేడారం, మహా:** మేడారంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భక్తులకు అంకితం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన మేడారం మహా జాతరను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి మేడారంలో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోమవారం ఉదయం ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పునర్నిర్మాణం చేసిన ఆలయంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### ఆడవారు ఎలాంటి బట్టలేసుకోవాలో చెప్పడానికి మీరెవరు?

- కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి ఫైర్

02



### కీరవాణికి అరుదైన గౌరవం

- సంగీత దిగ్గజానికి మహత్తర అవకాశం

02



### ఒక కుక్క కరిస్తే వంద కుక్కల్ని చంపుతారా?

- నటి, సామాజిక కార్యకర్త రేణు దేశాయ్ ఫైర్
- వీధి కుక్కల బాధ్యత తీసుకునేందుకు సిద్ధమని ప్రకటన

08



కర్నాటక పోలీసు శాఖలో

## కలకలం

- రాసలీలల వీడియోతో పోలీసు బాస్
- ఆఫీసులోనే అసభ్యకరంగా మహిళలతో ఉన్న వీడియోలు
- సీరియస్ అయిన సీఎం సిద్ధరామయ్య
- బంగారం స్మగ్లింగ్ లో దొరికిపోయిన కన్నడ నటి రన్యారావు తండ్రి రామచందర్ రావు

వివరాలు 2లో



### ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- అదనంగా 1.98లక్షల ఎకరాలకు ఆయకట్టు సాధనకు ప్రణాళిక
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- కొదుమూరువందనం ఎత్తిపోతలకు శ్రీకారం

02

# మంత్రులకు సీఎం పరీక్ష

**మునిసిపాలిటీలు క్లీన్ స్వీప్ చేయాలని టార్గెట్**


**పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా గెలుపుబాధ్యత**

**నిజామాబాద్ కు ఉత్తమ్.. ఆదిలాబాద్ కు సుదర్శన్ రెడ్డి**

**ఖమ్మంకు కొండా.. మానుకోటకు పొన్నం**

**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుల్ ఫోకస్ పెట్టారు. సోమవారం మంత్రులకు కీలక బాధ్యతలు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగబోయే ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్లవారీగా బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వ్యూహరచన చేశారు. కార్పొరేషన్, మున్సిపల్ అభ్యర్థుల ఎంపిక కూడా ఇంచార్జ్ మంత్రులకే అప్పగించారు. మంగళవారం నుండే పార్లమెంట్ సెగ్మెంట్లలో మున్సిపాలిటీల వారీగా సన్నాహక సమావేశాలు మొదలు పెట్టాలని సీఎం మంత్రులను ఆదేశించారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో చేరికలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతీ మునిసిపాలిటీ పక్కాగా గెలవాలని, క్లీన్ స్వీప్ చేయాలని టార్గెట్ నిర్దేశించారు. ఏప్రిల్ తర్వాత పునర్వ్యవస్థీకరణ ప్రచారం నేపథ్యంలో ఈ ఫలితాలను కూడా ఓ ప్రామాణికంగా తీసుకునే అవకాశాలున్నాయి. కొండా సురేఖకు ఖమ్మం, నిజామాబాద్ ఇన్ ఛార్జిగా ఉన్న సీతక్కను భువనగిరికి, హైదరాబాద్ ఇన్ ఛార్జిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ను మహబూబాబాద్

మిగతా 2లో




# ఈనెల 21న మున్సిపల్ షెడ్యూల్?

**ఈనెల 26-27 తేదీల్లో నోటిఫికేషన్ విడుదల చేసే ఛాన్స్**

**ఫిబ్రవరి 12 లేదా 14న పోలింగ్.. ప్రభుత్వవర్గాల్లో చర్చ**

**హైదరాబాద్, మహా:** మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. మునిసిపాలిటీల రిజర్వేషన్లు ఖరారుకావడం, ఎన్నికల నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక షెడ్యూల్ విడుదలే జరగాల్సి ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ వైపు దావోస్ పర్యటనకు వెళ్తూ మరోవైపు మంత్రులపై మునిసిపల్ బాధ్యతలు ఉంచారు. ఈ క్రమంలో తమకు అప్పగించిన పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతల పర్యవేక్షణలో.. మంత్రులు నిమగ్నమయ్యారు. ఈనెల 21న షెడ్యూల్, 26 లేదా 27న నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలుస్తోంది. నోటిఫికేషన్ వచ్చిన రోజు నుండే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 29 వరకు నామినేషన్ల స్వీకరణ, 30న పరిశీలన, తిరస్కరణ, 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబవరి ఒకటి అభ్యంతరాల పరిష్కారం, ఫిబ్రవరి 2న నామినేషన్ ఉపసంహరణ గడువు, ఫిబ్రవరి 3 నుండి 10 వరకు ప్రచారానికి గడువు ఉండే అవకాశముందని, ఫిబ్రవరి 12న పోలింగ్ జరిగే అవకాశముందని తెలుస్తోంది. మంత్రులు ఫీల్డ్ కు వెళ్ళాక సమయం కోరితే ఫిబ్రవరి 14న పోలింగ్ కు వెళ్ళేలా షెడ్యూల్ లో మార్పులు చేర్పులు జరగవచ్చని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటిస్తే గానీ అసలు తేదీలు తెలియవు. ఒకరోజు అటుఇటుగా ఇవే తేదీలు ఉంటాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు అన్నింటికీ ఒక్కరోజే ఒకేసారి పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



02

## స్పీకర్‌కు సుప్రీంకోర్టు షాక్

- కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన బీజేఎల్పీ నేత ఏలేటి
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కు సుప్రీంకోర్టు నోటీసులు
- వచ్చే నెల 6కు విచారణ వాయిదా

**ఢిల్లీ, మహా :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయలేదని పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను కౌశిక్ రెడ్డి, కేటీఆర్ పిటిషన్లతో జత చేసిన సుప్రీంకోర్టు అన్ని పిటిషన్లపై విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది. బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్‌ను బీజేపీ సుప్రీం కోర్టు లో సవాలు చేసింది. దీనిపై కూడా 6న విచారణ జరగనుంది.



### సింగరేణి టెండర్లపై సీబీఐ విచారణకు ఆదేశించండి

- కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డిలకు హరీష్ రావు చాలెంజ్
- ఆధారాలను అందించేందుకు సిద్ధమని ప్రకటన

వివరాలు 8లో




ఫోన్ ట్యాపింగ్ కేసులో

## సంచలనం

02

**హరీష్ రావుకు సిట్ నోటీసులు**



### ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికలకు హైకోర్టు స్టే ఇచ్చింది. మునిసిపాలిటీలోని 15 వార్డులలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని, మరణించిన వారిని ఓటర్ జాబితా నుండి తొలగించకపోవడం, వార్డులో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు కలిగి ఉండడంతో అడ్వకేట్ వస్పుల మల్లేష్ కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆమనగల్ మున్సిపాలిటీ ఎన్నికలకు స్టే విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఫిబ్రవరి 9 వరకు ఓటర్ జాబితాను సవరించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. హైకోర్టు తుది తీర్పు వెలువడేంత వరకు ఎన్నికల ప్రక్రియను ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కల్వకుంట్ల కవిత కోసం రంగంలోకి

## ప్రశాంత్ కిషోర్

**రాజకీయ వ్యూహకర్తతో కవిత వరుస భేటీలు**

**కొత్త పార్టీ ప్రారంభానికి ముందు కీలక పరిణామాలు**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు వైపు అడుగులు వేస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కవిత కొత్త పార్టీ కోసం రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రంగంలోకి దిగినట్లు సమాచారం. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే రాజకీయ పార్టీ అవసరం ఉందని ఇటీవల చెప్పిన కల్వకుంట్ల కవిత.. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. 2029లో ఎన్నికల్లో తెలంగాణ ప్రజల తరఫున పోటీ చేస్తామన్నారు. అందులో భాగంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాలకు పదును పెట్టేందుకు ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో కవిత

మిగతా 2లో



**పోటీపడి బీర్లు తాగిన సాఫ్ట్ వేర్ ఉద్యోగులు**

## చివరకు ప్రాణాలు విడిచారు

**మదనపల్లి, మహా:** ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు. పోటీపడి 19 బీర్లు తాగారు. చివరికి మృతి చెందిన ఘటన సంచలనంగా మారింది. ఆంధ్రప్రదేశ్ లోని అన్నమయ్య జిల్లా కేవీ పల్లి మండలం బండవడ్డీపల్లిలో ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు పోటీపడి 19 బీర్లు తాగారు. ఆ తర్వాత మృతి చెందారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆరుగురు స్నేహితులు కలిసి పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. ఆ పార్టీ సమయంలో మనీ కుమార్ (32), పుష్పరాజ్ (28) అనే ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు పోటీపడి మద్యం సేవించారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు ఇద్దరు



కలిసి 19 బడ్వైజర్ బీర్లు తాగినట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు అతిగా మద్యం సేవించడం వల్ల తీవ్ర డీహైడ్రేషన్ గురై ఇద్దరు పరిస్థితి విషమించింది. వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మణికుమార్ మార్గమధ్యలో మృతిచెందగా పుష్పరాజ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## మంత్రులకు సీఎం పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ కు ఇన్ ఛార్జిలుగా నియమించారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం సీనియర్లకు బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం ఇన్ ఛార్జిగా మంత్రిగా ఉన్న శ్రీహరిని నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్ ఛార్జిగా నియమించారు. స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న శ్రీహరిని ఇన్ ఛార్జిగా నియమిస్తే మంచి ఫలితాలు వస్తాయని సీఎం వ్యూహాత్మకంగా బాధ్యతలు అప్పగించారు.

**పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా..**

మల్కాజిగిరికోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
చేవెళ్లదుద్దిళ్ల శ్రీధర్ బాబు
ఖమ్మంకొండా సురేఖ
మహబూబాబాద్పొన్నం ప్రభాకర్
మహబూబ్‌నగర్దామోదర రాజనరసింహ
నాగర్‌కర్నూల్వాకిటి శ్రీహరి
జహీరాబాద్అజారుద్దీన్
మెదక్వివేక్ వెంకటస్వామి
నల్గొండఅడ్లూరి లక్ష్మణ్ కుమార్
భువనగిరిసీతక్క
నిజామాబాద్ఉత్తమ్ కుమార్ రెడ్డి
కరీంనగర్తుమ్మల నాగేశ్వరరావు
వరంగల్పొంగులేటి శ్రీనివాసరెడ్డి
పెద్దపల్లిజూపల్లి కృష్ణారావు
ఆదిలాబాద్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు



### కల్వకుంట్ల కవిత కోసం రంగంలోకి
## ప్రశాంత్ కిషోర్

(మొదటిపేజీ తరువాయి)

వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రెండు నెలల్లో రెండుసార్లు పీకే హైదరాబాద్ వచ్చి కవితతో బేటీ అయినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తే పరిస్థితులు ఎలా ఉంటాయి? పార్టీ ఏర్పాటు చేశాక ఎలా ముందుకెళ్లాలి ? ఎలాంటి వ్యూహాలతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి అనే అంశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ఇక సంక్రాంతి పండుగ సందర్భంగా కూడా వీరిద్దరు సమావేశం అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంపై కవిత గానీ.. తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా స్పందించలేదు. ఇదిలా ఉండగా, పార్టీ విధివిధానాల రూపకల్పన కోసం ఇప్పటికే 50 కమిటీలతో కవిత అధ్యయనం చేయిస్తున్నారు. ఇప్పుడు పీకే కూడా రంగంలోకి దిగారు. దీంతో త్వరలోనే కవిత కొత్త రాజకీయ పార్టీ ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ప్రశాంత్ కిశోర్ గతంలో ఏపీ మాజీ సీఎం జగన్‌కు, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కేసీఆర్‌కు కూడా పని చేశారు. అంతేకాకుండా తమిళనాడులో ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళ వెట్రి కళగం పార్టీకి కూడా ప్రశాంత్ కిశోర్ పనిచేశారు. అయితే కవిత, పీకే వ్యూహాలు ఎంతమేర ఫలిస్తాయో వేచి చూడాలి.

**తెలంగాణ సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వండి..**

మరోవైపు మనుగడ సాగించలేకపోయిన మావోయిస్టు సానుభూతిపరులకు, మావోయిస్టులు, మైనార్టీలకు కవిత ఇటీవల ఆహ్వానం పలికారు. తనతో కలిసి నడవాలని కోరారు. అటు బీసీలపైనా తన గొంతు వినిపిస్తున్నారు కవిత. యువతకు జాగృతి మంచి రాజకీయ వేదిక అవుతుందని అన్నారు. దీంతో అన్ని వర్గాల ప్రజలకు స్థానం కల్పిస్తూ.. తెలంగాణ సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వండని కోరారు.

## సింగరేణి టెండర్లపై సీబీఐ విచారణకు ఆదేశించండి

**కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డిలకు హరీష్ రావు చాలెంజ్.. ఆధారాలను అందించేందుకు సిద్ధమని ప్రకటన**

**హైదరాబాద్, మహా :** నైనీ కోల్ బ్లాక్ విషయంలో వాటాల పంచాయతీ తేలక రోడ్డు మీద పడ్డారంటూ తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బంధువు కనుసన్నల్లోనే పలు ప్రాజెక్టుల టెండర్లు ఖరారు చేస్తున్నారని ఆరోపించారు. నిజాయితీ, దమ్ముంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని సీఎం రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఛాలెంజ్ చేశారు. అన్ని సాక్ష్యాలను సీబీఐకి అందించేందుకు తాను సిద్ధమని హరీష్ రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన నైనీ కోల్ బ్లాక్ టెండర్ల వివాదంపై తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు.. అటు కేంద్రానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చీకటి ఒప్పందం లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

**కిషన్ రెడ్డికి, రేవంత్ కు మధ్య చీకటి ఒప్పందం**

సింగరేణిలో కేంద్రానికి సైతం వాటా ఉంది. కిషన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి చీకటి ఒప్పందం లేకపోతే దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా ఉండి కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తాను మాట్లాడిన ప్రతి విషయంపై ఆధారాలను సీబీఐకి ఇచ్చేందుకు తాను సిద్ధమన్నారు. రెండేళ్లుగా సింగరేణికి సీఎండీ లేకుండా పనులు చేపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని హరీష్ ఆరోపించారు. కేవలం తమ వ్యక్తులను ఇంచార్జ్‌లుగా నియమించి అడ్డగోలుగా దోచుకుంటున్నారని, సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**రేవంత్ అధికారం లోకి వచ్చాకే కొత్త రూల్స్**

కాంట్రాక్టర్ సైట్ విజిట్ అనేది భారతదేశంలో ఎక్కడా లేదని, నైనీ బొగ్గు బ్లాక్ విషయంలో కొత్తగా ప్రవేశపెట్టారని హరీష్ రావు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024లో సైట్ విజిట్ ప్రవేశపెట్టిన తరువాత బెనిఫిట్ జరిగిన తొలి వ్యక్తి ఆయన బామ్మర్ది సుజన్ రెడ్డి. ఆయన కంపెనీ శోదా కంపెనీకి సైట్ విజిట్ సర్టిఫికెట్ వచ్చిన తరువాత టెండర్ దక్కిందని ఆరోపించారు. సింగరేణిలో 6 టెండర్లు జరిగితే తమకు కావాల్సిన వారికే వాటిని కట్టబెట్టారని హరీష్ రావు అన్నారు. కోల్ బ్లాక్ టెండర్లు 10 నుంచి మైనస్ 22 శాతం వరకు కాంట్రాక్టర్లకు పోతుంది. బీఆర్ఎస్ హయాంలోనూ మైనస్ 7 నుంచి మైనస్ 20 వరకు కాంట్రాక్టర్లకు పోయింది. కానీ తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక సైట్ విజిట్ అని వచ్చాక ప్లస్ 7 నుంచి ప్లస్ 10 శాతం కాంట్రాక్టర్లకు పోతుందన్నారు. వివాదాస్పదమైన నైనీ కోల్ బ్లాక్ టెండర్లను మాత్రమే రద్దు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కానీ మిగతా అన్ని టెండర్లకు ఇదే విధానాన్ని అమలు చేశారు. వాటిని ఎందుకు రద్దు చేయడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు.



**సైట్ విజిట్ సర్టిఫికెట్ కుట్ర ఇదే**

'సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది కేవలం తెలంగాణలో ఉంది. అది రేవంత్ ప్రభుత్వం తెచ్చింది. గతంలో దేశ వ్యాప్తంగా ఎవరైనా టెండర్ వేసేవారు. ఇప్పుడు సైట్ విజిట్ సర్టిఫికెట్ వచ్చాక, కాంట్రాక్టర్లు సైట్ విజిట్ చేసి సర్టిఫికెట్ తీసుకోవాలి. అప్పుడు ఏ కాంట్రాక్టర్ టెండర్ వేశాడో తెలుసుకుని, వారి నుంచి కమీషన్లు తీసుకోవడమో.. లేక వారిని బెదిరించి టెండర్ వెనక్కి తీసుకునేలా చేసి తమకు కావాల్సిన వారి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రక్రియ తేలిక అవుతుంది' అని హరీష్ రావు వివరించారు. గతంలో ఉన్నట్లు మైనస్ 10 నుంచి మైనస్ 22 కాకుండా ప్లస్ 7 శాతం ఇస్తే.. తక్కువలో తక్కువగా 17 శాతం కమీషన్ ఎక్కువ వస్తుందన్నారు. కమీషన్లు కొల్లగొట్టేందుకు ఈ పద్ధతి తీసుకొచ్చారని హరీష్ రావు ఆరోపించారు.

గతంలో వెంకటేష్ కని అనే టెండర్ మైనస్ శాతానికి ఇచ్చాం. ఇప్పుడు దానికి రీటెండర్ చేసి ప్లస్ శాతానికి అప్పగించారు. ఎస్ఆర్పీ ఓసీ 2 శ్రీరాంపూర్ టెండర్ రద్దు చేసి మళ్లీ టెండర్ చేసి ప్లస్ శాతానికి తమ మనుషులకు టెండర్ అప్పగించి కమీషన్లు కొల్లగొట్టారు. ఓ టెండర్ మూడుసార్లు రద్దు చేసి, తిరిగి తమ అనుయాయులకు అప్పగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు.

**రేవంత్ రెడ్డి బంధువు కనుసన్నల్లోనే టెండర్లు ఖరారు**

గతంలో సింగరేణి డీజిల్ ఐఓసీ నుంచి తీసుకుని కాంట్రాక్టర్లకు ఇచ్చి పని మాత్రమే చేపించుకునే వారు. కానీ ఇప్పుడు డీజిల్ కూడా కాంట్రాక్టర్ల ఖాతాలో వేశారు. రూ.50 కోట్ల పని వంద కోట్లు అవుతుంది. సింగరేణి ఇచ్చే డీజిల్ విధానాన్ని రద్దు చేసి దాన్ని కాంట్రాక్టర్ల ఖాతాలో వేస్తే ఎక్కువ కమీషన్లు కొల్లగొడుతున్నారు. గతంలో 50 కోట్ల పనులకు కాంట్రాక్టర్లకు 18 శాతం జీఎస్టీ బిల్లులు కడితే, ఇప్పుడు 100 కోట్ల మీద జీఎస్టీ కడితే సింగరేణికి ఎంత నష్టం జరుగుతుందో రాష్ట్ర ప్రజలు గమనించాలని హరీష్ రావు అన్నారు. ఇదంతా సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడు, సమీప బంధువు కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం.. హరీష్ రావుకు సిట్ నోటీసులు

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ముఖ్యనేత హరీష్ రావుకు సిట్ నోటీసులు ఇచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. హరీష్ రావు పాత్రపై ఓ ప్రయివేట్ ఛానల్ ఎండీ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు విచారణపై దర్యాప్తు సంస్థను ధర్మాసనం ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. ఇంకెంత కాలం ఇంటరాగేషన్ కొనసాగిస్తారు? ఈ కేసులో ఇంకా ఏం మిగిలుంది? అంటూ స్పష్టమైన ప్రశ్నలు సంధించింది. ప్రభాకర్‌రావు ఇంటరాగేషన్‌ను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించిన కోర్టు.. దర్యాప్తునకు సహకరిస్తారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేసింది.

## కర్నాటక పోలీసు శాఖలో కలకలం

- రాసలీలల వీడియోతో పోలీసు బాస్
- ఆఫీసులోనే అసభ్యకరంగా మహిళలతో ఉన్న వీడియోలు
- సీరియస్ అయిన సీఎం సిద్ధరామయ్య
- బంగారం స్మగ్లింగ్ లో దొరికిపోయిన కన్నడ నటి రన్యారావు తండ్రి రామచందర్ రావు



**బెంగళూరు, మహా :** కర్ణాటక పోలీసు విభాగంలో అత్యున్నత హోదాలో ఉన్న డీజీపీ స్థాయి అధికారి డాక్టర్ రామచంద్రరావుకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏకంగా తన అధికారిక ఛాంబర్‌లోనే యూనిఫాంలో ఉండి, విధుల్లో ఉన్న సమయంలోనే మహిళలతో సన్నిహితంగా ఉన్న దృశ్యాలు ఈ వీడియోలలో బయటపడ్డాయి. అత్యంత క్రమశిక్షణతో ఉండాల్సిన పోలీసు కార్యాలయం ఇలాంటి రాసలీలలకు వేదిక కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైరల్ అవుతున్న డియోలను సదరు అధికారి కార్యాలయంలోనే రహస్యంగా చిత్రీకరించినట్లు తెలుస్తోంది. వేర్వేరు సమయాల్లో వివిధ మహిళలతో ఆయన అత్యంత సన్నిహితంగా మెలిగిన దృశ్యాలు అందులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక మహిళను కౌగిలించుకోవడం, మరొకరికి ముద్దు పెట్టడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసు శాఖ పరువు బజారున పడిందనే చర్చ సాగుతోంది. ఈ వ్యవహారంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రాసలీలల భాగోతం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. పోలీసు శాఖలో ఇంతటి నైతిక పతనంపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల నుంచి నివేదిక కోరారు. ప్రభుత్వంపై ఇప్పటికే విపక్షాల నుంచి ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో, ఈ వీడియోల వ్యవహారం కాంగ్రెస్ సర్కార్‌కు కొత్త తలనొప్పిగా మారింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, తనపై వస్తున్న ఈ ఆరోపణలను డీజీపీ రామచంద్రరావు తోసిపుచ్చారు. ఆ వీడియోలు నకిలీవని, ఎవరో కావాలనే తనను లక్ష్యంగా చేసుకుని మార్ఫింగ్ వీడియోలను సృష్టించారని ఆయన వాదిస్తున్నారు. తన ప్రతిష్టను దెబ్బతీయడానికి జరుగుతున్న కుట్రగా ఆయన దీనిని అభివర్ణించారు. కాగా, ఈ అధికారి గతంలోనూ తన కుమార్తె నటి రన్యారావుకి సంబంధించిన ఒక వివాదంలో సెలవుపై వెళ్లాల్సి వచ్చింది. మళ్ళీ ఇప్పుడు ఈ తాజా వివాదం ఆయనను మరింత చిక్కుల్లోకి నెట్టింది.



### పాత తరం తప్పుకుని..
## కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి
**నితిన్ గడ్కరీ**

**మహా:** పాత తరం క్రమంగా తప్పుకోవాలని, కొత్త తరం బాధ్యతలను స్వీకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నాగపూర్ లో జరిగిన 'అడ్వాంటేజ్ విదర్భ ఆధ్యోగిక్ మహోత్సవ్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అడ్వాంటేజ్ విదర్భ ఇనిషియేటివ్ లో ఆశిష్ కాలే కీలక పాత్రను పోషిస్తున్నారని కొనియాడారు. ఆశిష్ తండ్రి తన స్నేహితుడని... కొత్త తరానికి అవకాశం కల్పిస్తూ తాము క్రమంగా బాధ్యతల నుంచి తప్పుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని చెప్పారు. వాహనం బాగా నడుస్తున్నప్పుడే కొత్త తరానికి బాధ్యతలను అప్పగించాలని అన్నారు. బాధ్యతల నుంచి పాత తరం తప్పుకుని కొత్త పనుల్లో నిమగ్నమవ్వాలని చెప్పారు.

### అట్టహాసంగా మేడారం ఆలయ ప్రాంగణం
## పునఃప్రారంభం

**మహా జాతరను లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**ఆలయం చుట్టూ ఆకట్టుకుంటున్న గిరిజన శిల్పాలు**

**దావోస్ కు వెళ్ళిన ముఖ్యమంత్రి**



(మొదటిపేజీ తరువాయి)

అనంతరం కుటుంబ సమేతంగా వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సొంగులేటి, సీతక్క, కొండా సురేఖ సహా ముఖ్యనేతలంతా జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.

**రాతిశిలలతో అద్భుత నిర్మాణాలు**

ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం దిద్దుకుంది. చారిత్రక కట్టడాల తరహాలో అద్భుత కట్టడం ఆవిష్కృతమైంది. సమ్మక్కసారలమ్మ మహాజాతర నిర్మాణ పనులు చరిత్రలోనే ఓ మైలు రాయిగా నిలిచిపోయేలా సర్కార్ చేపట్టింది. రాతిశిలలతో అభివృద్ధి పనులకు ప్రాణం పోయగా, 4 వేల టన్నుల గ్రానైట్‌పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసేలా 7 వేల చిత్రాలను హృద్యంగా చిత్రీకరించారు. సెప్టెంబర్ 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా మూడు నెలల వ్యవధిలోనే పనులను పూర్తి చేశారు. సమ్మక్క సారలమ్మ చరిత్ర, పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను కళ్లకు కట్టినట్టుగా నిర్మాణాలు చేపట్టారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ చరిత్రను కళ్లకు కట్టే విధంగా వందల ఏళ్లు చెక్కు చెదరకుండా పనులు పూర్తి చేశారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకార నిర్మాణాన్ని పూర్తి చేశారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం, వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలు చెక్కారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు అబ్బురపరుస్తున్నాయి. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల చిత్రాలను ఏర్పాటు చేశారు.

**దావోస్ కు సీఎం రేవంత్**
**ఫిబ్రవరి 1 దాకా విదేశీ పర్యటన**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు బయల్దేరారు. మేడారంలో సమ్మక్క సారక్కల గద్దెలను పున:ప్రారంభించిన సీఎం..అక్కడి నుంచి నేరుగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చారు. అనంతరం అక్కడి నుంచి దావోస్ కు వెళ్లారు. జనవరి 23 వరకు సీఎం రేవంత్ బృందం దావోస్ లో పర్యటించనుంది. జనవరి 20 నుంచి నాలుగు రోజుల పాటు దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొననున్నారు. రేవంత్ తో పాటు మంత్రులు పొంగులేటి,శ్రీధర్ బాబు వెళ్లారు. తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ దావోస్ టూర్ జరగనుంది. ప్రముఖ కంపెనల సీఈవోలతో సీఎం టీం ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు ,పరిశ్రమల విస్తరణ,ఐటీ,ఏఐ, లైఫ్ సైన్సెస్ ,తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరపనున్నారు. దావోస్ పర్యటనతోపాటు వారం రోజులపాటు ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బోస్టన్‌లోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు వెళ్తున్నారు. దీంతో ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు సీఎం విదేశీ పర్యటనలో ఉంటారు.

### ఆడవారు ఎలాంటి బట్టలేసుకోవాలో
## చెప్పడానికి మీరెవరు?

**కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి ఫైర్**

**హైదరాబాద్, మహా :** 'ఆడవారు ఎలాంటి బట్టలేసుకోవాలో చెప్పడానికి మీరెవరు. ఆడవారి హక్కులపై సోషల్ మీడియాలో దాడి జరిగితే సహించేది లేదు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన హక్కులు కల్పించాల్సిందే. ఇష్టం వచ్చినట్టు తప్పుడు రాతలు రాస్తే బాగుండదు. ఆడవారి హక్కులకు భంగం కలిగించాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదు' అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి హెచ్చరించారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడం అంటే.. ఆ స్కీమ్ ను నిర్వీర్యం చేయడమే అన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజల మనోభావాలతో ఆడుకుంటోందని.. అభివృద్ధి చేయడం పక్కన పెట్టేసి సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.





## కీరవాణికి అరుదైన గౌరవం

**సంగీత దిగ్గజానికి మహత్తర అవకాశం**

**మహా :** ఆస్కార్ అవార్డు విజేత, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి కి అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని వేదికగా ఈ నెల 26న జరగబోయే 77వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు సంగీతం అందించే అవకాశం ఆయనకు లభించింది. ఈ మేరకు కీరవాణి తన 'ఎక్స్' అకౌంట్‌లో వెల్లడించారు. 'అందరికీ వందేమాతరం! ప్రతిష్టాత్మక గీతం వందేమాతరానికి 150 ఏళ్లు అవుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జనవరి 26న రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతాన్ని స్వరపరిచే అవకాశం నాకు లభించడం ఎంతో గర్వంగా, గౌరవంగా ఉంది. ఈ మహత్తర కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 2,500 మంది కళాకారులు పాల్గొంటారు. మన దేశ ఆత్మను ప్రతిబింబించే ఈ వేడుకను ఆస్వాదించండి. వందేమాతరం' అంటూ తన ట్వీట్‌లో కీరవాణి పేర్కొన్నారు. కీరవాణి ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న యూనివర్సల్ సినిమా వారణాసికి సంగీతం అందిస్తున్నారు.

# ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

**అదనంగా 1.98లక్షల ఎకరాలకు ఆయకట్టు సాధనకు ప్రణాళిక.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. కొదుమూరు-వందనం ఎత్తిపోతలకు శ్రీకారం**

**ఖమ్మం(చింతకాని),మహా :** ఖమ్మం జిల్లాలో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధనకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క సోమవారం చింతకాని మండలం వందనం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 35 కోట్ల 75 లక్షలతో చేపట్టిన కొదుమూరువందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు, వందనం గ్రామంలో ఎస్సి కాలనీలో కోటి 85 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల పనులకు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి వందనం పుట్టకోట జెడ్పీ రోడ్డు వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టనున్న బీ.టి రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ* కొదుమూరు వందనం లిఫ్ట్ పనులు గతంలో పూర్తి చేసి 2,500 ఎకరాలకు 2013 ప్రాంతంలో సాగు నీరు అందించామని అన్నారు. చింతకాని మండలం చుట్టు నాగార్జున సాగర్ నీళ్ళు ఉన్నప్పటికి కొదుమూరు, వందనం రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడ్డారని, వీరి ఆవేదన పరిశీలించి 2009 లో ఇచ్చిన మాట ప్రకారం అప్పట్లో మొదటి విడత లిఫ్ట్ పూర్తి చేశామని అన్నారు. కొదుమూరు వందనం లిఫ్ట్ కారణంగా ఎండాకాలంలో కూడా నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కొదుమూరు వందనం లిఫ్ట్ రెండవ ఫేజ్ కు శ్రీకారం చుట్టామని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట గత పాలకులు పేద ప్రజలను మోసం చేశారని, ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పాద యాత్రలో ప్రతి గ్రామంలో ప్రజలు ఇండ్ల కోసం తాపత్రయం పడటం గమనించి అధికారంలోకి రాగానే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో మంజూరు చేసామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. జిల్లాలో 2 లక్షల 79 వేల ఎకరాల ఆయకట్టు ఉమ్మడి రాష్ట్రంలో కల్పించామని అన్నారు. ప్రజా ప్రభుత్వం నేడు మరో లక్షా 98 వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాధించేందుకు ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ ద్వారా లక్షా 38 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, జవహర్ లిఫ్ట్ క్రింద 33 వేల 25 ఎకరాలు, రాజీవ్ ఫీడర్ కెనాల్ ద్వారా 23 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, కొదుమూరు వందనం లిఫ్ట్ ద్వారా 2,500 ఎకరాలు, మంచుకొండ లిఫ్ట్ ద్వారా 2,412 ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందించే పనులు చేపట్టామని అన్నారు.నేడు రైతులకు మేలు చేసేందుకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్, సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంపై గత 2 సంవత్సరాల కాలంలో ప్రజా ప్రభుత్వం 74 వేల 163 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని అన్నారు. మధిర అసెంబ్లీ 5 మండలాల పరిధిలో కట్టలేరు, మున్నేరు, వైరా నది జలాలు వృథాగా పోకుండా ఆనకట్టలు కట్టిస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రజల స్థితిగతులు మెరుగవ్వాలని అన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో ఉండే విధంగా ఇందిరమ్మ చీరలను ప్రత్యేకంగా డిజైన్ చేయించి ఇంటింటికీ పంపిణీ చేశామని అన్నారు. 96 లక్షల కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా ప్రతి సభ్యుడికి ఉచితంగా నెలకు 6 కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఎటువంటి రాబందులు, గద్దలు ప్రజా సొమ్ము కాజేయకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 35 కోట్ల వ్యయంతో కొదుమూరువందనం ఎత్తిపోతల రెండవ విడత పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని, ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం వల్ల 2,500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టును అతి తక్కువ కరెంటు ఖర్చుతో గ్రావిటీ ద్వారా అధికంగా పొలాలకు సాగునీరు అందేలా డిజైన్ చేశామని, ఈ ప్రాజెక్టు కొదుమూరు గ్రామ రైతులకు బాగా ఉపయోగపడుతుందని అన్నారు. కొదుమూరు వందనం ఎత్తిపోతల పథకం రెండవ విడత పనులు త్వరగా పూర్తయ్యే విధంగా ఇరిగేషన్ అధికారులు మానిటరింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా పెద్ద ఎత్తున ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్త కళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఇరిగేషన్ ఈఎన్సి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, మత్కేపల్లి ఏఎంసి చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు,సిపిఓ ఏ శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి నవీన్ బాబు, జిల్లా మైనారిటీ అధికారి ముజాహిద్, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బీజేపీ కొత్త బాస్‌గా నితిన్ నబీన్

## నేడు ప్రమాణ స్వీకారం.. హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ

## నడ్డా నుంచి బాధ్యతలు తీసుకోనున్న నితిన్ నబీన్

**న్యూఢిల్లీ, మహా :** బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ను ప్రతిపాదిస్తూ 37 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయనకు పోటీగా ఎలాంటి నామినేషన్లు రాకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం లాంఛనంగా మారింది. ప్రస్తుతం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న నితిన్ నబీన్ మంగళవారం ఉదయం 11 గంటలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పార్టీ ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఇవాళ ఉదయం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. నితిన్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, ఇతర అగ్రనేతలు హాజరయ్యారు. నితిన్ నబీన్ ఎన్నికపై అధికారికంగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రకటించారు.

**నేపథ్యమిది....**

నితిన్ నబిన్ సిన్హా జననం 23 మే 1980 జన్మించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుడు. ఆయన బీహార్ శాసనసభకు బంకిపూర్ శాసనసభ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై నితీష్ కుమార్ మంత్రివర్గంలో రాష్ట్ర రోడ్డు నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. నితిన్ నబిన్‌ను 2025 డిసెంబర్ 14న భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు నియమించింది. నితిన్ నబిన్ తన తండ్రి మాజీ ఎమ్మెల్యే నబిన్ కిషోర్ ప్రసాద్ మరణాంతరం 2006లో భారతీయ జనతా పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి 2006లో జరిగిన ఎన్నికల్లో పాట్నా వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. ఆ తరువాత బంకిపూర్ అసెంబ్లీ నుండి పోటీ చేసి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. నితిన్ నబిన్ నాల్గొవసారి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నితీష్ కుమార్ మంత్రివర్గంలో 9 ఫిబ్రవరి 2021 నుండి 9 ఆగష్టు 2022 వరకు రాష్ట్ర రోడ్డు నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు.

# నాగోబా జాతర ప్రారంభం

- శాస్త్రోక్తంగా మెస్త్రం వంశీయుల మహాపూజ
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- 20న పెర్సాపేన్ బాన్క్ పేన్ పూజలు
- 22న నాగోబా దర్బార్
- 23న భేతాల్, మండగాజిలింగ్ పూజలు
- 25న జాతర ముగింపు
- తెల్లని వస్త్రాలు ధరించడం ప్రత్యేకత



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ నాగోబా జాతర, పుష్యమాస అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మెస్త్రం వంశీయులు పవిత్ర గంగాజలంతో నాగోబా దేవతకు అభిషేకం చేసి, కొత్త కుండల్లో వండిన నైవేద్యాలను సమర్పించి శాస్త్రోక్తంగా మహాపూజ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు నాగోబా దేవతకు హారతి ఇచ్చి జాతరను అధికారికంగా ప్రారంభించారు. మెస్త్రం వంశీయులు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి నాగోబా దేవత చిత్రపటాన్ని బహుకరించారు.

**సాంప్రదాయంగా..**

గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు కేస్లాపూర్ నాగోబా జాతర ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఎంపీ నగేష్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్ అన్నారు. మెస్త్రం వంశీయులు వందల కిలోమీటర్లు పాదయాత్ర చేసి పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించడం వారి అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. గిరిజన గూడాల్లోని ప్రతి కుటుంబంపై నాగోబా దేవత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. నాగోబా జాతర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాకుండా గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ నెల 22న జరగనున్న 'దర్బార్' కార్యక్రమంలో గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన నాగోబా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు దేవాలయ పరిసరాల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**సర్వం సిద్ధం..కలెక్టర్**

గిరిజనుల ఆచార వ్యవహారాలకు నాగోబా జాతర ఒక ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా, పారిశుధ్యం, వైద్య శిబిరాల ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత సంవత్సరం దర్బార్‌లో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు చేపట్టామని, ఈ నెల 22న నిర్వహించనున్న దర్బార్ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో జాతరను జరుపుకోవాలని కోరారు.

**పటిష్ట బందోబస్తు-ఎస్పీ**

జాతర సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సీసీ కెమెరాల నిఘాతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్, ఉట్నూర్ అడిషనల్ ఎస్పీ కాజల్ సింగ్, వివిధ శాఖల అధికారులు, మెస్త్రం వంశీయులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నాగోబా గురించి..**

ఆదివాసీ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబా దేవాలయం ఆదిలాబాదు పట్టణానికి నలభై కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం కేశ్లాపూర్ గ్రామంలో ఉంది. ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. జాతర సమయాలలో ఆదివాసీలతో పాటు లక్షలాది మంది దర్శించుకుంటారు. నాగోబా ను కొలిస్తే పంటలు బాగా పండుతాయని శాంతి విరాజిల్లుతుందని రోగాలు నయమవుతాయని గిరిజనుల విశ్వాసం.

**ప్రధాన ఘట్టాలు**

ముందుగా నెలవంక కనిపించిన తెల్లవారి పుష్య మాస ప్రారంభంలో ఉమ్మడి జిల్లాలోని మేస్రం వంశీయులు కేశ్లాపూరులో నాగోబా మురాడీ వద్ద పీఠాధిపతి మేస్రం వెంకటరావు నేతృత్వంలో సమావేశమై ప్రచార యాత్ర, గంగాజల యాత్ర, మహాపూజ, జాతర నిర్వహణ పై చర్చించారు. మురాడీలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచార రథాన్ని ప్రారంభించారు. గ్రామ పొలి మేర వరకు మేస్రం వంశీయుల్లోని అల్లుడు కచ్చులం నడపగా అక్కడి నుండి ఆలయ కటోడాల ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగించారు. ముందుగా ఆనవాయితీగా సిరికొండ మండల కేంద్రంలోని గుగ్గిళ్ల వంశానికి చెందిన కుమ్మరి వద్ద మహాపూజకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. ఏడు రోజుల పాటు ఈ ప్రచార రథం సిరికొండ, రాచంపేట, కొలాడి, సోయంగూడ, గిన్నెర, సాలేవాడ, వడగాం గ్రామాలలో జాతర కార్యక్రమాల గురించి ప్రచారం చేపట్టి తిరిగి కేశ్లాపూరుకు చేరుకుంది.

**గోదావరి కి పాదయాత్ర**

అనంతరం జాతరలోని రెండవ ఘట్టం పవిత్ర గోదావరి జలం కోసం పాదయాత్ర జనవరి 1న మొదలైంది. మేస్రం వంశీయులు తెల్లని వస్త్రాలు ధరించి మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని హస్తినమడుగుకు కాలినడకన ప్రయాణమయ్యారు. ఈ నెల 7 న అక్కడకు చేరుకుని గోదారమ్మ కు ప్రత్యేక పూజలు చేసి తమ కళశాలలో గోదావరి నీరు నింపుకొని వంటలు వండుకొని భోజనం చేసి తిరిగి కేశ్లా పూరు కు బయలుదేరారు. ఈ నెల 14 న ఇంద్రవల్లి లోని ఇంద్రాదేవికి పూజలు చేసి 15 న కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లపై కేశ్లాపూరు కు చేరుకున్నారు.

**మహా పూజ**

గోదావరి నుండి తెచ్చిన పవిత్ర జలాలను నేలను తాకకుండా కర్రలకు కళశాలు కట్టి కేశ్లాపూరు గ్రామంలోని మర్రి చెట్టు పై భద్ర పరుస్తారు. మర్రి చెట్ల కింద తమ పిత్రు దేవతలకు సాంప్రదాయక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 18న అర్ధరాత్రి అమావాస్య రోజున హస్తిన మడుగు గోదావరి నుంచి సేకరించిన పవిత్ర గోదావరి జలాలతో నాగోబా ను అభిషేకించి ఆలయాన్ని శుద్ధి చేసి మహాపూజ నిర్వహించి జాతరను ప్రారంభించారు. మహాపూజ అనంతరం ఐదు రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. నాగోబా పూజల అనంతరం నాగోబా ఆలయ ఆవరణలో ఉన్న పుట్టను మట్టితో మెత్తడంలో మేశ్రం వంశీయుల అల్లుళ్ళకు పెద్ద పీఠం వేస్తారు. అల్లుళ్ళు మట్టిని కాళ్ళతో తొక్కి మెత్తగా చేస్తే కూతుళ్ళు ఆ మట్టితో పుట్టను మెత్తి అలికి మొక్కులు తీర్చుకుంటారు. అల్లుళ్ళు మట్టిని తొక్కినందుకు వారికి ప్రత్యేక నజరాన అందజేయడం సాంప్రదాయంగా వస్తోంది.

**ఇరవై రెండు పొయ్యిలు**

ఇక జాతరకు వచ్చే మేశ్రం వంశీయులు వేలాది మంది ఉన్నా.. వారు వంట చేసుకొనేది మాత్రం ఇరవై రెండు పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు కూడా ఎక్కడ పడితే అక్కడ పెట్టడానికి వీలు లేదు .ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహారీ గోడ లోపల పెట్టాలి. గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు, దుగుడులు ఉన్నాయి. ఆ దీపాల కాంతులలో ఇరవై రెండు పొయ్యిల్లో మేశ్రం వంశీయులు వంతుల వారిగా ఆ దీపాల కాంతుల వెలుగులో ఇరవై రెండు పొయ్యిల్లో మేశ్రం వంశీయులు వంతుల వారిగా వంటలు చేసుకుంటారు.మిగతా జాతుల వారు వారికి ఇష్టమైన చోట వంటలు వండుకుంటారు.

**కొత్త కోడళ్ల పరిచయం**

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్ లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళ్తారు. ఆమె చేత దేవుడికి పూజ చేయించి, వధువును పరిచయం చేస్తారు. దీన్నే బేటింగ్ కీ వాల్ అంటారు. ఎప్పటివరకైతే మెస్రం తెగ వధువు ఈ పరిచయ వేదికలో పాల్గొనదో, అప్పటి దాకా వారు నాగోబా దేవుణ్ణి చూడటం, పూజించటం నిషిద్ధం. వధువులు ఇంటి నుంచి ఎడ్లబండి వెనక బెదరుముట్టలో పూజా సామగ్రిని పట్టుకొని గాలినడకన బయలుదేరతారు. కేస్లాపూరులోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను బేటీ కొరియాడ్ అని పిలుస్తారు. వధువులు ఇద్దరు చొప్పున జతలుగా ఏర్పడి, ముఖం నిండా తెల్లటి దుస్తులతో ముసుగు ధరిస్తారు. పూజా కార్యక్రమానికి ముందు నాగోబా దేవుని వద్దకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు.

**దర్బార్**

ఈ జాతరలో కీలకమైన గిరిజన దర్బార్ ఈనెల 22న జరగనుంది. స్వాతంత్ర్యం రాక ముందు నిజాం పాలనలో.. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసిస్తున్న తండాలు, గూడాలు గ్రామాలకు కనీస సౌకర్యాలు ఉండేవి కావు. ఆదివాసీల జీవన విధానంపై అధ్యయనం కోసం నిజాంప్రభువు హైమన్ డార్ఫ్ దంపతులను ఈ ప్రాంతానికి పంపారు. ఆ దంపతులను నాగోబా జాతర ఆకర్షించింది. జాతర చివరి రోజున వారి సమస్యలు తెలుసుకునేందుకు సమావేశం నిర్వహించేవారు. దానినే దర్బార్ గా పిలిచేవారు.ఈ దర్బారులో ఆదివాసీల సమస్యలను తెలుసుకొని నిజాం ప్రభువుకు అందించేవారు. అలా తొలిసారి 1942 లో దర్బారు నిర్వహించారు. అదే ఆనవాయితీగా కొనసాగుతోంది. స్వాతంత్ర్యానంతరం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల సమక్షంలో దర్బారు జరుగుతోంది.


**కార్యక్రమాలు**

నాగోబా జాతర సందర్భంగా మెస్రం వంశీయులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 18 ఆదివారము రాత్రి 1000 గం లకు మహాపూజ అనంతరం సతిక్ పూజ చేపడతారు. 20న మంగళవారం కేవలం పురుషులు మాత్రమే పాల్గొనే పెర్సాపేన్ పూజ అనంతరం బాన్క్ పేన్ పూజ నిర్వహిస్తారు. 22న ఉదయం 1100గం.ల నుండి నాగోబా దర్బార్ 23న శుక్రవారము భేతాల్ పూజ , మండగాజిలింగ్ పూజ నిర్వహిస్తారు.

**ముగింపు**

జాతర పూర్తయ్యాక మెస్రం వంశీయులు కేశ్లాపూర్ నుండి శ్యాంపూర్ లోని బొడుందేవి జాతరకు వెళ్లి ఎవరి గృహాలకు వాళ్ళు వెళ్తారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలనుంచే కాక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

# కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలోకి నిత్యం చేరికలు జరుగుతున్నాయి. తాజాగా సోమవారం తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో 21 వార్డు క్రాంతినగర్ నుండి అసపు వినోద్ , జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామం నుండి సర్పంచ్ సోర్తె గజానన్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుండి నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. మున్సిపల్ ఎన్నికల్లో 49 వార్డులో పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం ఇటీవలి గ్రామపంచాయితీ ఎన్నికల్లో గెలిచిన కొందరు సర్పంచులను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ , మాజీ కౌన్సిలర్లు బండారి సతీష్ , కలాల శ్రీనివాస్ , సందానర్సింగ్ ,జాఫర్ అహ్మద్ , ఇమ్రాన్ ,సర్పంచులు రామన్న, వినోద్ , ఉప సర్పంచ్ నిమ్మల రవికాంత్ రెడ్డి, నాయకులు షకీల్,రాంరెడ్డి,రఫీఖ్, శ్రీలేఖ,ప్రశాంత్, సంతోష్, అంజాద్ , అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుంది

- **అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రులు**
- **జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేకానంద**




**మంచిర్యాల, మహా :** ప్రజా సంక్షేమం దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద లు ప్రశంసలు కురిపించారు. సోమవారం చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేకానందలతో పాటు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఉపాధి శిక్షణ శాఖ సంచాలకులు నిర్మల కాంతి వెస్లీ లు భూమి పూజ మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలతో కలిసి ప్రజా ప్రభుత్వాన్ని సమర్థవంతంగా అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని వెల్లడించారు. అందులో భాగంగా చెన్నూర్ పట్టణంలో 47 కోట్ల 11 లక్షల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసి నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నామని చెప్పారు. తద్వారా చదువుకున్న యువతకు వృత్తి విద్యా కోర్సులలో నైపుణ్య శిక్షణను అందించి ఉపాధి కల్పించడం ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగమే అవసరం లేదని తెలిపారు. వృత్తి విద్య కోర్సుల వల్ల కూడా జీవనాన్ని కొనసాగించవచ్చని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో 40 కోట్ల రూపాయలతో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను అర్హులకు అందించి ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందని వెల్లడించారు. నియోజకవర్గంలో గడిచిన పది సంవత్సరాలలో ఎవ్వరికీ కెసిఆర్ ప్రభుత్వం డబ్బులు బెడ్ రూమ్ గృహాలను ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రజా ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ గృహ పథకం ద్వారా ఇండ్లను శిరవేగంగా మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో విద్యార్థులను, విద్యారంగాన్ని బలోపేతం చేయడం కొరకు సోమనపల్లి ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసి నిర్మాణ పనులు కూడా చేపట్టామని తెలిపారు. విదేశీ విద్యను అభ్యసించే విద్యార్థులకు విదేశీ విద్యా పథకం ద్వారా 20 లక్షల రూపాయలను అందించి ప్రోత్సహించడం జరుగుతుందని పేర్కొన్నారు. చెన్నూర్ చుట్టుపక్కల ప్రాంత ప్రజల వైద్య సౌకర్యం కొరకు 100 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి శరవేగంగా నిర్మిస్తున్నామని అన్నారు.

# రెండవ రోజు రోడ్డు కోసం దీక్ష



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం రైల్వే గేటు నుండి పెంబర్తి వరకు రోడ్డు పునర్నిర్మాణం చేయాలని లంబాడి హక్కుల పోరాట సంఘం చేస్తున్న నిరసన దీక్ష సోమవారం రెండవ రోజుకు చేరింది ఈ ధర్నాకు గుండ్లగూడెం బిఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్ రెడ్డి మద్దతు తెలిపారు ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మూడవత్ అశోక్ నాయక్ ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీ లు, నేతల మద్దతుగా కోరుతూ రెండవ రోజు నిరాహార దీక్ష కార్యక్రమం చెప్పట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయికుమార్ నాయక్, వార్డు సభ్యులు రేణుక శివ నాయక్, ఆలేటి నాగార్జున, మాజీ ఉపసర్పంచ్ లు రాజు నాయక్ రవి నాయక్, BRS నాయకులు దేవేందర్ నాయక్, బలరాం, వీరేందర్ నాయక్, మేకల భాను, గజ్జెల మధు, రమేష్, హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని పలువురి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.కొత్తగా పెళ్లయిన ప్రతి అర్హత కలిగిన మహిళకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని,ఈ పథకం వల్ల వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని అన్నారు.



## మహా దిన పత్రిక, ఎఎన్ ఎన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య...

యాదాద్రి భువనగిరి, మహా: మహ దినపత్రిక, ఎ ఎన్ ఎన్ టీవి 2026 వ సంవత్సరం క్యాలెండర్లను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నేడు యాదగిరిగుట్ట తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా స్టాప్ రిపోర్టర్ ఎర్ర జాన్సన్ తో పాటు విలేకర్లు పాల్గొన్నారు..

# మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి



- **ప్రజా సంక్షేమానికి పథకాల అమలు**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**వేములవాడ మహా:** మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు.ఇందిరా మహిళా శక్తి కింద వేములవాడ పట్టణంలోని 392 (ఎస్ హెచ్ జీ)లకు దాదాపు రూ.1 కోటీ ల 46 లక్షల 19 వేల 636 రూపాయల చెక్కులను ఇందిరమ్మ చీరలను వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి సోమవారం పంపిణీ చేశారు.

# ఈనెల 20న ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఆరోగ్య మహిళా శిబిరం

**డిప్యూటీ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్..**

**నాగర్ కర్నూలు జిల్లా మహా :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఈనెల 20న మంగళవారం నాడు మహిళల ఆరోగ్య దినోత్సవ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ జిల్లాలోని మహిళలు ఆరోగ్యంగా ఉండుటకు వివిధ ప్రాణాంతక వ్యాధుల భారి నుండి తప్పించుకొనుటకు ముందు జాగ్రత్తగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని గది నెంబరు 24 లో మంగళవారం నాడు మధ్యాహ్నం12 గంటల వరకు స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్లు డాక్టర్ నీలిమ,డాక్టర్ సుప్రియ వారి వైద్య బృందం ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.రుతుక్రమ సమస్యలు,గర్భాశయ సమస్యలు,గర్భాశయంలో గడ్డలు, ఫైబ్రాయిడ్స్,సిస్టులు, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళలు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని ఆయన సూచించారు.గతంలో ఉన్న రిపోర్టులు,స్కానింగ్, ఇతర చికిత్స రిపోర్టులు, ఆధార్ కార్డు వెంబడి తెచ్చుకోవాలన్నారు.ఆసుపత్రిలో అన్ని రకాల మూత్ర రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీతో దీక్ష విరమణ



**ఆలేరు, మహా:** మా గ్రామ పంచాయతీ మాకు కావాలని బహదూర్‌పేట గ్రామ ప్రజలు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు సోమవారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. అయితే సోమవారంప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బహదూర్‌పేటను ఆలేరు మున్సిపాలిటీ నుంచి తొలగించి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తామని అఖిలపక్ష నాయకులకు ఫోన్ ద్వారా హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో గ్రామ ప్రజలు తమ నివధిక దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో దొంతుల సరేష్, ఖమ్మంపల్లి నరేశ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వట్టిపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు వట్టిపల్లి మొగలి మల్లయ్య, కుందే సంపత్, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు బీదని కొమ్మురయ్య, పల్లె మహేష్, దొంతుల ఎల్లేష్, వట్టిపల్లి లక్ష్మణ్, రాములు, వస్పరి బాలయ్య, ముదపాక విజయ్, ధ్యాప ఎలందర్, రాజు, కర్రే సత్తయ్య, ఉతా పవన్, దొంతుల రాములు, చిన్నం వెంకటేష్, జెట్టా బాలనరయ్య, మహేష్, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా:** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భూదాన్ పోచంపల్లి కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు.ప్రతి రోజు ఇన్ పేషెంట్ , ఔట్ పేషంట్ ఎంతమంది పేషంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలు చెకప్ కు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకొని గర్భిణీ స్త్రీ తో కలెక్టర్ స్వయంగా ఫోన్ లో మాట్లాడి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసున్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి డబ్బును వృథా ఖర్చు చేయరాదన్నారు. ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్
20-01-2025





మేడారం ప్రత్యేకం









# పులకించిన.. మేడారం

## మంత్రివర్గంతో కలిసి.. సీఎం రేవంత్ ఉత్సాహంగా.. సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు.. ఆలయ పునఃప్రారంభంతో సరికొత్త చరిత్ర

**మహా, ప్రత్యేకం:** రాష్ట్రమంత్రివర్గమంతా మేడారంలో కొలువుదీరింది. ఉన్నతాధికారులంతా మేడారం వైభవానికి సాక్షిగా నిలిచారు. చిట్టడివిలో.. రాష్ట్ర సర్కారు ముఖ్యులంతా బసచేయడం ఓ చరిత్ర కాగా, మేడారం ఆలయన పునఃప్రారంభంతో సీఎం రేవంత్ రెడ్డి తన మార్క్ ప్రదర్శించారు. మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. అంతకుముందు మేడారం గద్దెల ప్రాంగణం వద్దకు కుటుంబ సమేతంగా చేరుకున్న సీఎంకు ఆదివాసీ సంప్రదాయ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ , పొంగులేటి, సీతక్క, కొండా సురేఖ, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.












## జాన్ పహాడ్ దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను, అభివృద్ధి పనులను ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు



**హుజూర్ నగర్, మహా:** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్ పహాడ్ దర్గా ఉర్సు సందర్భంగా భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంజూరు చేసిన 50 లక్షల అభివృద్ధి నిధులతో మజీద్ చుట్టూ సీసీ రోడ్డు, దర్గా వద్ద హుజూ ఖానా, హజ్రత్ మొలి భావి వద్ద ప్రహరీ గోడ,భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను చేసేందుకు సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు స్థానిక సర్పంచ్ భూక్యా చరణ్ సింగ్ లు మాజీ ఎంపిపి భూక్యా గోపాల్ నాయక్, మాజీ జడ్పీటిసి మాలోత్ మోతీలాల్ నాయక్ లతో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతోనే గతంలో కోట్ల రూపాయలు నిధులతో దర్గా వద్ద అభివృద్ధి చేశామని ఇప్పుడు కూడా మంత్రి ఉత్తమ్ మంజూరు చేసిన అభివృద్ధి నిధులతో పనులు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు నీమానాయక్, కవితకిరణ్ , సైదా నాయక్, మాజీ ఎంపీటీసీ ల ఫోరం అధ్యక్షులు మీసాల ఉపేందర్, దర్గా ముజావర్ జానీ,నాయకులు వెచ్చాల శ్రీకాంత్,భూక్యా నాగరాజు, రాము షేక్ సైదులు మల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ లేని రుణాల పంపిణీతో పాటు చీరల పంపిణీ కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించాలి




**సూర్యాపేట జిల్లా మహా:** మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ ,ఇందిరమ్మ చీరల పంపిణీ పై సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దినసరి సీతక్క,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ ,జిల్లా కలెక్టర్లు,ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ వడ్డీ లేని రుణాల పంపిణీ తో పాటు చీరల పంపిణీ కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని అన్నారు. చీరల పంపిణీ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. అర్హులైన వారందరికీ చీరలను పంపిణీ చేయాలని, చీరాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ దనసరి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సర్ఫ్ సీఈఓ దివ్యదేవరాజన్ లు వడ్డీ లేని రుణాల పంపిణీ చీరల పంపిణీ పై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. సూర్యాపేట జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డీఈవో శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్, మెప్మా ప్రాజెక్టు అధికారి రమేష్ తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా పర్యటన సందర్భంగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట జిల్లా మహా:** త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముగ్దమ్ నగర్ లో 126 కోట్ల రూపాయలతో 100 ఎకరాలలో నిర్మించనున్న అగ్రికల్చర్ కాలేజికీ, కోదాడలో నవోదయ స్కూల్ కు శంకుస్థాపన సందర్భంగా, మట్టపల్లి దేవాలయం సందర్శన సందర్భంగా జిల్లా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీసీ హాల్ నందు ఎస్పీ కె నర్సింహా తో కలిసి గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో గవర్నర్ పర్యటన జిల్లాలో ఉన్నందున అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అలాగే హెలిపాడ్, త్రాగునీరు శానిటేషన్, దేవాలయం అలంకరణ, ప్రోటోకాల్ విధులు, స్టాల్స్ ఏర్పాటు, ఆహ్వాన పత్రికలు, సౌండ్ సిస్టం, అధికారులకు సిబ్బందికి పాసులు, శిలాఫలకాలు మొదలగు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులందరూ సమిష్టి కృషితో పనిచేసి గవర్నర్ పర్యటన విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ కె నరసింహ మాట్లాడుతూ గవర్నర్ పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, వెహికల్ పాసులు, తమ శాఖకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయబడతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ కే సీతారామారావు, డిపిఓ యాదగిరి, ఇన్చార్జ్ డిఆర్డిఏ పిడి శిరీష, జిల్లా వైద్యాధికారి పి వెంకటరమణ, కోదాడ, హుజూర్నగర్ మున్సిపల్ కమిషనర్లు, మట్టపల్లి దేవస్థానం అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, ఈవో జ్యోతి జిల్లా అధికారులు, వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ ద్వారా కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, హుజూర్నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తాసిల్దారులు కవిత,మంగా, ఆర్ అండ్ బి డిఇ సీతారామయ్య తదితరులు హాజరయ్యారు.

## కాంగ్రెస్ పాలనలో మహిళల అభివృద్ధి



**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**ఆమనగల్లు, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఆమనగల్లులో మున్సిపాలిటీ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, కమిషనర్ శంకర్ లతో కలిసి రూ. 93.92లక్షల వడ్డీ లేని రుణాలను, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి పథకాన్ని వారి పేరిట అందిస్తున్నట్లు వివరించారు.వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.



## కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

### ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**రుద్ర కుమార్ సిఐటియు జిల్లా అధ్యక్షులు**



**రాజేంద్రనగర్, మహా ;** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జిహెచ్ఎంసీలో విలీనమైన మున్సిపల్ కార్మికులందరినీ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ నీ సిఐటియు ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జే రుద్రకుమార్ సిఐటియు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రుద్ర కుమార్ మాట్లాడుతూ ప్రధానంగా తుర్కయంజాల్, మీర్పేట్ , బడంగ్పేట్ , జల్ పల్లి,తుక్కుగూడ తదితర మున్సిపాలిటీలలో పారిశుద్ధ విభాగంలో, డ్రైవర్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ చంద్రకళ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే అందరికీ వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. పర్మినెంట్ కు సంబంధించి పై అధికారులతో చర్చిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కిషన్ జిహెచ్ఎంసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, సీహెచ్ జ్యోతి బస్, నార్ల కంటి సాలయ్య, గోపాల్, ప్రవీణ్, అంజి, వెంకట్ రెడ్డి, వెంకటయ్య, చెక్క ప్రదీప్, స్వప్న, మల్లెల జయ, యశోద, వినోద, మంజుల, విష్ణు, రాధిక, లలిత, యాదమ్మ, యశోద,జ్యోతి సంజయ్, పి బాబు, రామచందర్ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు



## ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

**ఆమనగల్లు, మహా :** ప్రజలందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ భాగ్యమ్మ, ఉప సర్పంచ్ మహ్మద్ ఖదీర్ అన్నారు. మాడ్గుల మండలం గిరికొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నిధులతో బోరు, గ్రామ పంచాయితీ నిధులతో నూతన విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ లో ప్రజలు రాత్రి సమయంలో వెలుతురు లేక ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా మరమ్మతులకు గురైన వాటి స్థానంలో నూతన విధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజలు కూడా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### మంగళవారం యధావిధిగా ఆటోలు నడుస్తాయి: రాష్ట్ర అధ్యక్షులు నందకిషోర్

**రాజేంద్రనగర్, మహా :** తెలంగాణ, గ్రేటర్ హైదరాబాద్ లో మంగళవారం ఆటో బంద్ అనే ప్రచారం వాస్తవం కాదుని తెలంగాణ స్టేట్ ఆటో,ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు నందకిషోర్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆటోలు బంద్ లేవున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిన మాట వాస్తవం కానీ దానికి మున్సిపల్ ఎన్నికలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామన్నారు. సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని హామీలను ఎందుకు ఇచ్చిందని అసోసియేషన్ సభ్యులు మండిపడ్డారు.ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు అమలుకు ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ఏటా 12 వేల రూపాయల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఫీజు రీబర్స్మెంట్ చేయకపోవడంతో రవాణా కార్మికుల పిల్లల చదువులు ఆగంఅవుతున్నాయి. వెంటనే ఫీజు రీబ్రస్మెంట్ చేయాలని బియంయస్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఓలా,ఉబర్, ర్యాపిడో అక్రమ బైకులను వెంటనే నిలిపి వేయాలన్నారు.ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితి దిగజారి పోయింది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి, తెలంగాణ స్టేట్ ఆటో యూనియన్ అధ్యక్షులు నంద కిషోర్ , ప్రధాన కార్యదర్శి పెంటయ్య గౌడ్, యండి హబీబ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రతను పాటించండి.. ప్రమాదాలను నివారించండి

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులో సీఐ నరేందర్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ లోని పిఎన్ఆర్ కాలేజ్, వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఫ్యూచర్ సిటీ కమిషనర్, డిసిపి చేవెళ్ల ఆదేశాలతో కళాశాల విద్యార్థులకు అర్రైవ్ అలైవ్ 2026 క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## ఐద్వా ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి



**రాజేంద్రనగర్, మహా :** ఈనెల 25 న హైదరాబాద్ లో జరగబోయే ఐద్వా ఆల్ ఇండియా మహాసభల పోస్టర్ ను మత్స్య కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా, మేడ్చల్ మల్కాజ్గిరి, రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, హైదరాబాద్ నగర వృత్తి దారుల కార్యాలయంలో సోమవారం గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఉన్న మహిళలందరూ ఈ ఐద్వా ఆల్ ఇండియా మహాసభల బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, వరలక్ష్మి , మత్స్య కార్మిక సంఘం మూడు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, అమరావతి, బక్కి బాలమణి, నీరటి అనురాధ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డు పేరుతో మరో భూ దోపిడికి ప్రభుత్వం తెరలేపింది

రైతులతో కలిసి ఆందోళనలు, ధర్నా నిర్వహించి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, మహా :** రేడియల్ రింగ్ రోడ్ లో వ్యవసాయ భూములను కోల్పోతున్న రైతులు శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో రాజకీయ పార్టీలకు అతీతంగా సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ సొంత ఊరు కొడంగల్ కు రేడియల్ రోడ్డు వేసేందుకు కోత్వాల్ గూడ నుంచి కొడంగల్ రింగ్ రోడ్ పేరుతో రైతులకు ఉన్న కాస్త భూమిని కూడా ప్రభుత్వం లాగేసుకుంటుంది అన్నారు. శంషాబాద్ నుంచి షాబాద్ వెళ్లే రోడ్డు వెడల్పు జరుగుతున్నా రోడ్డును వదిలేసి.ఇంకో కొత్త రేడియల్ రోడ్డు ఎవరికోసమన్నారు. రైతుల భూములలోంచి రేడియల్ రోడ్డు వెయ్యనీయము. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అభివృద్ధి పేరు చెప్పి రైతుల వ్యవసాయ భూములను లాక్కోవడానికి పార్టీ మారింది. రైతులకు ప్రకాష్ గౌడ్ సమాధానం చెప్పాలని నిలదీశారు. అంతకు ముందున్న రోడ్డును వెడల్పు చేసుకుని వాడుకోవాలి తప్ప మరో కొత్త రోడ్డు కోసం ట్రిబుల్ వన్ జీవో పరిధిలో రైతులకు ఉన్న కాస్త పొలాన్ని కూడా రేడియాల్ రోడ్డు పేరుతో ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు.వెంటనే ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి. లేకపోతే భారీ రైతు ఉద్యమం తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలోసీనియర్ నాయకులు మురళీధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, మాజీ పిఎసిఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, శంకర్ రెడ్డి, మల్కారం గ్రామ మాజీ సర్పంచ్ కొత్త యాదిగిరి రెడ్డి, సర్పంచ్ బిక్షపతి రెడ్డి, మండలంలోని పలువురు రైతులు, గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు మోహన్ రావు, మాచర్ల శ్రీనివాస్, రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు మూడు కోట్ల 50 లక్షల రుణాల పంపిణీ




**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహిళల అభ్యున్నతికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడు ఉంటుందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శాస్త్రా గార్డెన్స్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలకు మూడు కోట్ల 50 లక్షల ఋణాలను, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పాట పడుతుందని మహిళల అభివృద్ధి ధ్యేయంగా రుణాలను అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన డ్వాక్రా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఏందిరా మహిళా శక్తి ద్వారా మూడు కోట్ల 50 లక్షల రూపాయలు వాళ్ళ అభివృద్ధికి అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి ఇంట్లో మహిళలు అనుకుంటే ఏదైనా సాధించేవరకు శక్తి వంచన లేకుండా పోరాడతారని మహిళా శక్తి ద్వారా వాళ్లకు రుణాలు అందజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, పలు శాఖల ఉన్నతాధికారులు, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు, మాజీ చైర్మన్ పాండురంగ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, ఈసి చంద్రశేఖర్ గౌడ్ మామ, ముత్యాల రాజశేఖర్ రావు, ప్రశాంత్ కుమార్, మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఆనంద్ కుమార్, డ్వాక్రా సంఘాల మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**మొయినాబాద్ మహా:** సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య రంగారెడ్డి జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మొయినాబాద్ లోని మీ అంజనీదేవి గార్డెన్ లో మున్సిపల్ పరిధిలోని గాత్ర మహిళా సంఘాల సభ్యులందరికీ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుయుద్దీన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోపరుచుకోవాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం ఎంతో ఆదర్శమని అన్నారు. గతంలో ఇచ్చిన చీరలు నాణ్యత ఉండేవి కావని ప్రస్తుతం ఇందిరమ్మ చీరలు ఎంతో నాణ్యతతో ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలకు మంచి చీరలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం ద్వారా రుణాలు అందించడం జరుగుతుందని, వాటిని ఆర్థిక అభివృద్ధితో పాటు కుటుంబ పోషణ పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుయుద్దీన్ మున్సిపల్ మేనేజర్ నరేందర్, మున్సిపల్ ఆర్వో జమీల్, అశోక్, శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, రాఘవేందర్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మాజీ జెడ్పీటీసీ కాలే శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, హనుమంత్ యాదవ్, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కొండల లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తే సహించేది లేదు

### నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య, కార్యదర్శి చెంచు రామయ్య



పోతురాజు యాదయ్య, నాన్ టీచింగ్ అధ్యక్షులు



చెంచు రామయ్య, నాన్ టీచింగ్ కార్యదర్శి

**రాజేంద్రనగర్, మహా ;** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలోప్రొఫెసర్ల నియామకాల కోసం ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వర్సిటీ నాన్ టీచింగ్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య, కార్యదర్శి చెంచు రామయ్య,తీవ్రంగా ఖండించారు. కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తూ విశ్వవిద్యాలయ పేరు ప్రతిష్టను భంగం కలిగించేందుకు ప్రయత్నించడం పై వారు తీవ్రంగా మండిపడ్డారు. గత 12 సంవత్సరాలుగా ఒక్క నియామకం కూడా జరగని పరిస్థితుల్లో, డాక్టర్ దండ రాజిరెడ్డి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి 79 అసిస్టెంట్ ప్రొఫెసర్ 17 ప్రొఫెసర్ 44 అసోసియేట్ ప్రొఫెసర్ల నియామ కోసం అనుమతి తీసుకుని నోటిఫికేషన్ విడుదల చేశారు. అధ్యాపక పోస్టులను తీసుకువచ్చి విశ్వవిద్యాలయ అభివృద్ధికి బలమైన పునాది వేశారని స్పష్టం చేశారు. అలాంటి నోటిఫికేషను జీర్ణించు కోలేక,స్వార్థ ప్రయోజనాలతో కొందరు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తూ యూనివర్సిటీ గౌరవాన్ని దెబ్బతీయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. .పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు శాస్త్రవే పోతురాజు యాదయ్య నాన్ టీచింగ్ అధ్యక్షులు త్తలుగా ఎదగాలని మంచి ఉద్దేశంతో నోటిఫికేషన్ విడుదల చేయడాన్నే వక్రీకరించి అసత్య ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా మండిపడ్డారు. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన సమయంలో యువ శాస్త్రవేత్తల భవిష్యత్తుతో చెలగాటం ఆడేలా కావాలనే తప్పుడు ప్రచారాలు చేయడం మన్నించరాని నేరమని స్పష్టం చేశారు. విద్యార్థుల అకాడమిక్ అభివృద్ధిని అడ్డుకునే ఈ రకమైన నీచ కుట్రలను తక్షణమే నిలిపివేయాలని ,కోరారు.లేనిపక్షంలో సంబంధితులపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నాన్‌టీచింగ్ అసోసియేషన్ సభ్యులు హెచ్చరించారు. బోర్డు సభ్యులు వైస్ ప్రెసిడెంట్ కే,రాజేశ్వరి,వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ, అపర్ణ,కోశాధికారి ఎస్, రాజు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆమనగల్లు సిఐ జానకిరామ్ రెడ్డి**




**ఆమనగల్లు, మహా:** ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు సిఐ జానకిరామ్ రెడ్డిఅన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణం లోనిరాంరెడ్డి లయన్ విజన్ సెంటర్లో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు కే గోవర్ధన్ రెడ్డి తో కలిసి ఆమనగల్లు సీఐ జానకిరామ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చూపు మందగించడం వారికే ఆపరేషన్ చేయించి వారిని తిరిగి తీసుకురావడం చాలా గొప్ప సేవ అని ఆయన అన్నారు. క్లబ్బు ఆధ్వర్యంలో చేపట్టే వైద్య,ఆరోగ్య శిబిరాలను నిరుపేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు కల్లా దానం చేసి మన ఇద్దరికీ దృష్టి భాగ్యం కల్పించాలన్నారు. నేత్రదానం మహాదానం ఒకరి నేత్రదానం ఇద్దరి అందులకు చూపు ప్రధానం అని ఆయన అన్నారు. శిబిరంలో కంటి వైద్యులు ఎం చంద్రశేఖర్ 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 40 మందిని ఐఓఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,క్లబ్బు ఉపాధ్యక్షులు యంగలి బాలకృష్ణ, జిల్లా చైర్మన్ నటరాజ్ యాదయ్య,జూలూరు రమేష్, క్లబ్ సభ్యులు కొరివి వెంకటయ్య, క్లబ్ పిఆర్ఓ పాషా, శిరీష తదితరులు పాల్గొన్నారు

## వర్ధన్నపేటలో ఘనంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే**
**కె.ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్**



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణం లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఇందిరమ్మ చీరల తో పాటు వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు గా చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేయడంతో పాటు మహిళా సంఘాలకు 122 సంఘాలకు 28 లక్షల 84 వేల 141 రూపాయల విలువ గల వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళ సంఘాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుధీర్, మెప్మా వహీదా, టౌన్ స్వయం సహాయక సంఘాల అధ్యక్షురాలు అర్రెల్లి లక్ష్మీ, సర్పంచ్లు చిటూరి రాజు, పఠాన్ రజాక్, ఎస్బిఐ బ్యాంక్ ప్రతినిధులు స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.



## తడి పొడి చెత్త వేరుపై అవగాహన కార్యక్రమం

**పాల్గొన్న కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి**

**వరంగల్ మహా;** బల్దియా కమిషనర్ ఆదేశాల మేరకు సిఎంహెచ్ఓ, ఎంహెచ్ఓ ఆధ్వర్యంలో వరంగల్ నగరం 22 వ డివిజన్ లోని మర్రి వెంకటయ్య కాలనీ రోడ్ నెంబర్ 1 లోని శ్రీరామ టవర్స్ అపార్ట్మెంట్ లోని ఫ్లాట్ల యాజమానుల తో తడి చెత్త పొడి చెత్త తో పాటు హానికరమైన చెత్త వేరు చేయడం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 22 వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ప్లాటు నుండి రోజు తడి పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని అపార్ట్మెంట్ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ పి రమేష్ , జవాన్ పి శివప్రసాద్, వాలంటరీ రాధిక, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల వలయంలో చేవెళ్ల ఎస్సీ బాలుర వసతి గృహం

**పెచ్చులు ఊడిపడుతున్న పట్టించుకోని అధికారులు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న హాస్టళ్ల నిర్వహణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పేద విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. దానికి నిద ర్శనంగా చేవెళ్ల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతుం వసతి గృహంలో ఉండే విద్యార్థుల పరిస్థితి నయంగా మారిందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన పట్ల వారిని వివరణ కోరగా.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ వసతి గృహాన్ని సందర్శించినట్లు వారు తెలిపారు. ఈ సం దర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల. చందు మాట్లాడుతూ.. ఈ వసతి గృహంలో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. అలాగే వసతి గృహంలో బోరు పనిచేయడం లేదని, నీటి సమస్య కూడా ఉందని తెలిపారు. ఈ సమస్యలను విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కావున జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఈ వసతి గృహ భవనాన్ని సందర్శించి నూతన భవనం మంజూరు చేయాలని లేదా మరమ్మత్తులు చేయాలని కోరారు. అదేవిధంగా నీటి సమస్య పరిష్కారం చేయాలన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు హిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్. ఉపాధ్యక్షుడు ఇర్ఫాన్. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా ;** ప్రజా సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమం లో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు వివరాలు విభాగాల వారిగా.... టౌన్ ప్లానింగ్.....34. ఇంజనీరింగ్..... 18. రెవిన్యూ........10. హెల్త్& శానిటేషన్..06, నీటి సరఫరా... 03 మొత్తం....71 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఎస్ ఈ సత్యనారాయణ సి ఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య ,టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కఠినమైన ఖాకీ డ్రెస్సు వెనుక వెన్న లాంటి మనసు

**నెక్కొండ ఎస్సై మహేందర్**



**వరంగల్ మహా;** విధి నిర్వహణలో పోలీసుల మాట తీరు వారి వ్యవహార శైలిని చూసి అందరూ అబ్బా పోలీసులు ఇంత కఠినంగా ఉంటారా అనుకునేవారు చాలామంది ఉంటారు. కానీ క్రైమ్ జరిగితే కఠినంగా వ్యవహరించడమే కాదు కఠినమైన ఖాకీ డ్రెస్ వెనుక వెన్న లాంటి మనసు కూడా ఉందని నిరూపించారు నెక్కొండ ఎస్సై మహేందర్. కొంతకాలం క్రితం తల్లిదండ్రులను కోల్పోయి నిలువ నీడ లేని ఇద్దరు బాలికలకు తన సొంత డబ్బులతో ఇల్లు కట్టించేందుకు ముందుకు వచ్చారు ఎస్సై మహేందర్. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కొర్పోలు గ్రామంలో ఆరు నెలల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు బాలికలకు సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్ తానున్నానంటూ అండగా నిలిచారు. పిల్లల దైన్య స్థితిని ఓ పత్రిక ద్వారా తెలుసుకొని వారికి సొంత డబ్బులతో రెండు రూము లు కట్టించేందుకు సోమవారం ముగ్గు పోసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టినందు కు ఎస్సై మహేందర్ ను స్థానిక ప్రజలు, పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.



## అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** మేడారం మహా జాతర నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటనలో భాగంగా సమ్మక్క-సారలమ్మ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ముఖ్యమంత్రి తో కలిసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ఈ దర్శన కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. మేడారం జాతరను పురస్కరించుకుని ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టినట్లు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం వైద్య, భద్రత, తాగునీరు, రవాణా వంటి ఏర్పాట్ల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

## టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్ కాంగ్రెస్ లో చేరిక



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వ పథకాల కు ఆకర్షితులైన టీటీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్ కాంగ్రెస్ లో పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజా భవన్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి రంగారెడ్డి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై, పార్టీలో చేరినట్లు రవీందర్ వెల్లడించారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రెండు వందల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలోని ఆదర్శ నియోజవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, సీఎం రిలీఫ్ ఫండ్స్ అనేక కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని, సర్వే ఆధారంగా అభ్యర్థులను నిర్ణయిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో భాగంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ జడ్పిటిసి భూపతి గల్ల మహిపాల్, రాష్ట్ర నాయకులు ఈసీ చంద్రశేఖర్ గౌడ్, ముత్యాల రాజశేఖర్, ప్రశాంత్, మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఆనంద్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ జెర్కొని బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పోష్ యాక్ట్–2013ను ఖచ్చితంగా అమలు చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ యాక్ట్-2013 (కార్యస్థలాల్లో మహిళల పై లైంగిక వేధింపుల నివారణ చట్టం) పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోష్ యాక్ట్-2013కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పనిచేసే ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి శాఖాధిపతి, కార్యాలయ అధికారి పై ఉందని పేర్కొన్నారు. పోష్ యాక్ట్-2013 ప్రకారం 10 మంది కంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని, అందులో 50 శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమిటీలో మహిళా అధ్యక్షురాలు ఉండాలని, బయటి నిపుణుడిని కూడా సభ్యుడిగా నియమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని గోప్యతతో, నిష్పక్షపాతంగా, వేగంగా విచారణ చేసి పరిష్కరించాలని సూచించారు. పోష్ యాక్ట్ పై ప్రతి ఉద్యోగికి అవగాహన ఉండేలా తరచూ శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోస్టర్లు, కరపత్రాలు కార్యాలయాల్లో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయగల వాతావరణం కల్పించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు పరిపాలన సాగించాలి

**చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలంలోని ముచింతల్ స్వర్ణ భారతి ట్రస్ట్ లో సోమవారం నూతన సర్పంచ్ లకు శిక్షణ కార్యక్రమాని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణా రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ పంచాయతి వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సర్పంచులకు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్ లదే, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమన్నారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డైరెక్టర్ పద్మజా,, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, పద్మజా రాణి జెడి , టి జి ఐ అర్ డి, డి ఎల్ పిఓ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ముస్క శ్రీనివాస్



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలోని నర్సంపేట పోలీస్ స్టేషన్ కు నూతన ఇన్స్పెక్టర్ గా ముస్క శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపి మాట్లాడుతూ పోలీసుల పై ప్రజలకు నమ్మకం, విశ్వాసంతో పాటు గౌరవం పెరిగేలా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా పేద ప్రజలకు, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అప్పుడే ప్రజల్లో పోలీసుల పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని సీపి తెలిపారు.

## నీటి సరఫరాలో సమయపాలన పాటించండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** నీటి సరఫరా వేళల్లో సమయపాలన పాటించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఇంజనీరింగ్ అధికారులతో నీటి సరఫరా తో పాటు వివిధ అభివృద్ధి పనుల పురోగతి పై ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నల్లా కనెక్షన్ లతో పాటు మీటర్ నల్లా కనెక్షన్ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లీకేజీలను ఎప్పటికపుడు అరికట్టి నీటి సరఫరా లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నీటి సరఫరా లో టైమింగ్స్ ను పక్కా గా పాటించాలని ప్రధాన మైన అభివృద్ధి పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, ఈ ఈ లు రవి కుమార్, సంతోష్ బాబు, మహేందర్, డి ఈ లు, ఏ ఈ లు, తదితరులు, పాల్గొన్నారు.

## ఎన్నికైన సర్పంచులు ప్రజలకు సుపరిపాలన అందించాలి

- సర్పంచులు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధి లో శ్రీరామచంద్రుడిని ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సుపరిపాలన అందించాలని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో, జిల్లాలోని 11 మండలాలకు చెందిన నూతన సర్పంచుల కోసం నాలుగు విడతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన మొదటి విడతలో భాగంగా గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట మండలాలకు చెందిన 84 మంది సర్పంచులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశం అన్ని ప్రభుత్వ పథకాల పై సంపూర్ణ అవగాహన కల్పించి, గ్రామ పరిపాలనను ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో నేర్పించడమేనని కలెక్టర్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన, బాధ్యతాయుత పరిపాలన నిర్వహించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకొని నిరంతరం కృషి చేయాలని కోరారు. సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, విపత్తుల సమయంలో సర్పంచుల పాత్ర, డిజిటల్ సైన్ వినియోగం, ఆదర్శ గ్రామపంచాయతీ ల నిర్మాణం వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం నిరుపేదలకు అందేలా సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు సామాజిక అభివృద్ధి సాధించే దిశగా పని చేయాలన్నారు. మానవత్వ కోణంతో సేవాభావంతో పాలన సాగించాలని సూచించారు. డిజిటల్ గవర్నెన్స్ కు అనుగుణంగా పని చేస్తూ సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపారు. అదేవిధంగా కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు (మోరల్ స్కిల్స్) వంటి అంశాలపై కూడా సర్పంచులకు అవగాహన అవసరమని అన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కుల వివక్ష, మూఢనమ్మకాల నిర్మూలనలో సర్పంచులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. వరంగల్ మహానగరం రాష్ట్రంలో రెండో రాజధానిగా అవతరించబోతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు పేర్కొన్న విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. సర్పంచులు ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తూ స్మార్ట్ పాలన అమలు చేసి వరంగల్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, టీవోటీలు పాక శ్రీనివాస్, కూచన ప్రకాష్, చంద్రకాంత్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సర్పంచ్ కూసం స్వరూప రమేష్, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు

## పరస్పర సహకార సంఘాలతో ప్రజలకు మేలు



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో పరస్పర సహాయక సంఘాలు అందులో సభ్యులు గా ఉన్న సభ్యులకు తక్కువ వడ్డీతో అప్పులను ఇవ్వడమే కాక పెరకవాడ లోని కాకతీయ పరస్పర సహాయక సహకార పరపతి సంఘం సుమారుగా 50 సంవత్సరాల నుండి 1950 సభ్యులతో సంఘం నడపబడుతున్నది.ఈ రోజు సంఘం అధ్యక్షులు ముత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడారం మహా జాతర సందర్భంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ప్రతి సభ్యునికి వాటా ధనం నుండి 10,000 రూపాయలను ఇవ్వడానికి సంఘ కార్యవర్గం తీర్మానం చేసి సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి నేడు అనగా మంగళవారం ఉదయం నుండి ప్రతి ఒక్క సభ్యునికి సంఘం కార్యాలయంలో 1950 మంది సభ్యులకి 10000/రూ అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు కార్యవర్గం అధ్యక్షులు ముత్తినేని శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు కొడకండ్ల దామోదర్, దేవులపల్లి సంపత్ ,ప్రధాన కార్యదర్శి అప్పని కృష్ణ, కార్యదర్శి కారుకూరి భాస్కర్, కోశాధికారి బత్తుల రమేష్ ,ఆర్గనైజర్ రాయబారపు భాస్కర్ మాదాసు రాజు, మార్త రాజు, ఎండి మొయినుద్దీన్, కార్యవర్గం కోడూరి రాజకుమార్, కూచన దయాసాగర్,పిట్ట సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికలకు హైకోర్టు స్టే ఇచ్చింది. మునిసిపాలిటీలోని 15 వార్డులలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని, మరణించిన వారిని ఓటర్ జాబితా నుండి తొలగించకపోవడం, వార్డులో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు కలిగి ఉండడంతో అడ్వకేట్ వస్పుల మల్లేష్ కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆమనగల్ మున్సిపాలిటీ ఎన్నికలకు స్టే విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఫిబ్రవరి 9 వరకు ఓటర్ జాబితాను సవరించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. హైకోర్టు తుది తీర్పు వెలువడేంత వరకు ఎన్నికల ప్రక్రియను ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రజా వినతులను త్వరగా పరిష్కరించండి



**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, డీడబ్ల్యూఓ రాజమణి, డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో జిల్లా కలెక్టర్ కు అందజేశారు. మొత్తం 71 వినతులు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 26, జీడబ్ల్యుఎంసీకి సంబంధించినవి 18, ఇతర శాఖలకు సంబంధించినవి 27 వినతులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, ఇప్పటివరకు పరిష్కారం కాని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తుదారులతో నేరుగా సంప్రదించి, సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా భూ సమస్యలు, పింఛన్లు, గృహాలు, వివిధ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన వినతులను పరిశీలించి, అర్హత మేరకు వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు ప్రజావాణి పోర్టల్‌లో అప్లోడ్ అవుతున్నాయని, పరిష్కరించిన దరఖాస్తులను కూడా తప్పనిసరిగా పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేనిపక్షంలో సమస్య పరిష్కారమైనప్పటికీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు చూపబడతాయని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీబీసీడీఓ పుష్పలత, డీసీఓ నీరజ, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, ఇతర సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కబ్జాల నుంచి పార్కు స్థలాలను కాపాడండి

**భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగల శ్రీశైలం**
**జిల్లా అదనపు కలెక్టర్కు వినతి పత్రం అందజేత**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తమ్మలోనిగూడ గ్రామ పరిధిలోని పార్కుల భూములను పరిరక్షించాలని శ్రీశైలం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, తమ్మలోనిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ పంచాయతీ, డిటీసీపీ లేఅవుట్లలో ఉన్న పార్కు స్థలాలు అక్రమ కబ్జాలకు గురవుతున్నాయని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగల శ్రీశైలం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ... ప్రధాన హైవే రోడ్డుకు సమీపంలో ఉన్న లేఅవుట్లలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో, కొందరు ప్రైవేట్ వ్యక్తులు నకిలీ పత్రాలను సృష్టించి ప్రభుత్వానికి కేటాయించిన పార్కు స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అక్రమ కబ్జాల వల్ల ప్రజా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, భవిష్యత్ తరాలకు అవసరమైన ఓపెన్ స్పేస్‌లు నశించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కావున గ్రామ పంచాయతీకి కేటాయించిన పార్కు స్థలాలలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సరిహద్దులు స్పష్టంగా గుర్తించి అక్రమ కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్‌ను కోరారు.

## సిల్వర్ కొత్త మార్క్.. చరిత్రలో తొలిసారి!

బంగారం ధరలు మాదిరిగానే వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1.50 లక్షలకు చేరువలో ఉండగా.. కేజీ సిల్వర్ రేటు ఏకంగా రూ. 3 లక్షలు దాటేసింది. పెట్టుబడిదారుల డిమాండ్, భౌగోళిక, రాజకీయ కారణాల వల్ల కేజీ వెండి రూ.3 లక్షల రికార్డును అధిగమించాయి. అంతర్జాతీయ మార్కెట్లో కూడా వెండి ఔన్సు ధర ఏకంగా 94.35 డాలర్లు పెరిగింది. ఇటీవలి సెషన్లలో బంగారం కంటే వెండికి డిమాండ్ పెరుగుతోందని.. దీనికి డాలర్ విలువ తగ్గడం కూడా సహాయపడిందని నిపుణులు చెబుతున్నారు. ఈ రోజు (జనవరి 19) హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో కేజీ వెండి రేటు 8000 రూపాయలు పెరిగి, రూ. 3.18 లక్షలకు చేరింది. ముంబైలో కేజీ సిల్వర్ రేటు రూ. 10వేలు పెరిగినప్పటికీ రూ. 3.05 లక్షల వద్ద నిలిచింది. ఢిల్లీలో కూడా ఇదే రేటు వద్ద కొనసాగుతోంది.


**వెండి ధరలు ఎందుకు పెరుగుతున్నాయంటే?**

వెండిని కేవలం ఆభరణాలు, కాయిన్స్ రూపంలో మాత్రమే కాకుండా.. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా.. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ కీలకంగా మారింది. ఇవన్నీ వెండి డిమాండును అమాంతం పెంచడంలో దోహదపడ్డాయి. ఎప్పుడైతే డిమాండ్ పెరిగిందో.. ధరలు ఆటోమేటిక్‌గా పెరుగుదలవైపు పరుగులు పెడతాయి.




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 324.17 పాయింట్ల నష్టంతో 83,246.18 వద్ద, నిఫ్టీ 108.85 పాయింట్ల నష్టంతో 25,585.50 వద్ద నిలిచాయి. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఏఎండీ ఇండస్ట్రీస్ లిమిటెడ్, జిందాల్ సా లిమిటెడ్, బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్, శ్రీ రామ న్యూస్‌ప్రింట్ లిమిటెడ్ కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. సుప్రీం హోల్డింగ్స్ & హాస్పిటాలిటీ (ఇండియా) లిమిటెడ్, హెచ్ఈసీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డిలిజెంట్ మీడియా కార్పొరేషన్ లిమిటెడ్, లక్ష్మీ కాట్స్పిన్ లిమిటెడ్, టాల్బ్రోస్ ఆటోమోటివ్ కాంపోనెంట్స్ లిమిటెడ్ కంపెనీలు నష్టాలను చవిచూశాయి.



## విద్యుత్తు బిల్లులో అసమానతలు

### సామాన్యుడిపై భారం.. డేటా సెంటర్లకు రాయితీ

అమెరికాలో గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లులు గుదిబండగా మారుతున్నాయి. గత ఐదేళ్లలో విద్యుత్ ధరలు ఆకాశాన్ని తాకగా ఈ భారం పంపిణీలో తీవ్ర అసమానతలు ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలు పెరుగుతున్నప్పటికీ, వాటి ఖర్చును కూడా సామాన్య పౌరులే మోయాల్సి వస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆకాశాన్నంటుతున్న ధరలు**

ఫిబ్రవరి 2020తో పోలిస్తే అమెరికా వ్యాప్తంగా విద్యుత్ ధరలు సగటున 40 శాతం పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ముఖ్యంగా వాషింగ్టన్‌లో జులై 2020 నుంచి జులై 2025 మధ్య విద్యుత్ ఖర్చులు ఏకంగా 93 శాతం పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ (EIA) డేటా ప్రకారం 20222024 మధ్య.. నివాస వినియోగదారుల విద్యుత్తు బిల్లులు 10 శాతం పెరిగాయి. వాణిజ్య వినియోగదారులపై 3 శాతం మాత్రమే పెరిగాయి. పారిశ్రామిక వినియోగదారులపై ధరలు 2 శాతం తగ్గాయి.

**డేటా సెంటర్లు**

చిన్నపాటి నగరాలకు సరిపోయే విద్యుత్తును వినియోగించే డేటా సెంటర్లు గ్రిడ్‌లోకి వస్తున్నా వాటికి తక్కువ ధరలకే విద్యుత్ అందుతోంది. ఈఐఏ గణాంకాల ప్రకారం, 2024 చివరి నాటికి నివాస వినియోగదారులకు యూనిట్ (కిలోవాట్‌గంట) ధర 16 సెంట్లు ఉండగా వాణిజ్య వినియోగదారులకు అది 13 సెంట్లు మాత్రమే ఉంది.

**ఈ వ్యత్యాసానికి కారణాలు**

నివాస ప్రాంతాలకు విద్యుత్ చేరవేయడానికి స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఖర్చు పెరిగింది. ఇవి తుఫానులు, అడవి మంటల వల్ల దెబ్బతింటే ఆ మరమ్మతు ఖర్చులు వినియోగదారులపైనే పడుతున్నాయి. డేటా సెంటర్లు నేరుగా హైవోల్టేజ్ ట్రాన్స్‌మిషన్ లైన్లకు అనుసంధానమవుతాయి. తద్వారా పంపిణీ ఖర్చుల నుంచి తప్పుకుంటున్నాయి. పెద్ద కంపెనీలకు ఉన్న లాబీయింగ్ బలం సామాన్య ప్రజలకు ఉండదు. యుటిలిటీ రెగ్యులేటర్ల వద్ద కంపెనీలు తమకు అనుకూలమైన ధరలను సాధించుకోగలుగుతున్నాయి.

**గ్రిడ్ అప్‌గ్రేడ్ భారం ఎవరిది?**

ఇటీవల యూఎస్‌లో పీజేఎం అనే గ్రిడ్ ఆపరేటర్ 5 బిలియన్ డాలర్ల వ్యయంతో ట్రాన్స్‌మిషన్ లైన్ల అప్‌గ్రేడ్ ప్రాజెక్టును చేపట్టింది. డేటా సెంటర్ల వల్లేఈ అప్‌గ్రేడ్ అవసరం ఏర్పడినప్పటికీ వర్జీనియా, మేరీల్యాండ్ వంటి ప్రాంతాల్లో ఈ భారాన్ని నివాస వినియోగదారుల బిల్లుల్లో చేర్చడం వివాదాస్పదమైంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయ నివేదిక ప్రకారం, అనేక యుటిలిటీ సంస్థలు మెటా వంటి దిగ్గజ కంపెనీలతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నాయి. టెక్సాస్‌లో ఎల్ పాసో ఎలక్ట్రిక్ సంస్థ మెటా డేటా సెంటర్ కోసం ప్రత్యేక రాయితీలు ఇచ్చి ఆ విషయాన్ని ప్రజల దృష్టికి రాకుండా దాచేందుకు ప్రయత్నించడం గమనార్హం.

**మార్పు దిశగా..**

ఈ అసమానతలపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. హార్వర్డ్ లా స్కూల్ ఎక్స్‌పర్ట్ అరి పెస్కో మాట్లాడుతూ ప్రజలను రక్షించాల్సిన బాధ్యత రెగ్యులేటర్లపై ఉందన్నారు. ఇప్పటికే వర్జీనియా రాష్ట్రం డేటా సెంటర్ల కోసం ప్రత్యేక వినియోగదారుల క్లాస్‌ను ఏర్పాటు చేసి గ్రిడ్ అప్‌గ్రేడ్ల కోసం వారి నుంచే ఎక్కువ వసూలు చేసేలా నిబంధనలు మార్చింది. విస్కాన్సిన్ వంటి రాష్ట్రాలు కూడా ఇదే బాటలో ఉన్నాయి. పెరుగుతున్న విద్యుత్ ధరలు అమెరికాలో ఒక ప్రధాన రాజకీయ, ఆర్థిక అంశంగా మారాయి. దీన్ని సరిదిద్దకపోతే ఓటర్ల ఆగ్రహం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బినామీ ఆస్తులకు చెక్

బినామీ ఆస్తులు... దాని వ్యవహారాలను భారత దేశంలో నిషేధించారు. ఇందుకు సంబంధించి 1988లో చట్టమే వచ్చింది. ఇది చాలా ముఖ్యమైన, బలమైన చట్టం. ఆస్తి అంటే: బినామీ వ్యవహారాలన్నీ ఆస్తి చుట్టూ తిరుగుతాయి. అందుకని 'ఆస్తి' అనే పదాన్ని బాగా నిర్వచించారు. చట్టంలో ఈ నిర్వచనం కష్టమయితే చాలా తెలివిగా, పరిధి ఎక్కువగా ఉండేలా వివరణ ఇచ్చారు. ఈ క్రిందివన్నీ 'ఆస్తి' అని పెద్ద జాబితా చెబుతారు. ఈ నిర్వచనం చదివితే మీకు భగవద్గీత స్ఫురణకు రాకతప్పదు. (1) ఏ రకమయినా.. స్థిరమైన, అస్థిరమైన, కంటికి కనిపించేవి... కనపడవని... భౌతికమైనవి... నిరాకారమైనవి. (2) హక్కు, ఆసక్తి, దస్తావేజుల్లో పేరు, ప్రస్తావన (3) రూపాంతరం చెందగలిగే ఆస్తి (4) పై పేర్కొన్న 1,2,3 ఆస్తుల ద్వారా వచ్చిన వసూళ్లు ..రియల్ ఎస్టేట్, భూములు, ఇళ్లు, పొలాలు, స్థిరాస్తులు, షేర్లు, వేతనాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు డిపాజిట్లు, నగదు బ్యాంకు లాకర్లు, ప్రయివేటు లాకర్లు మొదలైనవి.

**బినామీ వ్యవహారం ఏమిటంటే..**

ఒక వ్యవహారం-ఒప్పందం.. ఒక ఆస్తికి కాగితాల ప్రకారం ఓనర్ (యజమాని) ఓనమాలు రాని ఓబయ్య అయితే.., ఆ వ్యవహారానికి మదుపు పెట్టినది చదువుకున్న చలమయ్య. ఇందులో చలమయ్య గారికి ఇప్పుడు కానీ, భవిష్యత్తులో కానీ, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రయోజనం ఉంటుంది. లేని వ్యక్తి పేరు మీద, డమ్మీ వ్యక్తి పేరు మీద జరిగే వ్యవహారం... కర్త, కర్మ, క్రియ... ఒకరైతే.. అబద్ధపు పేరుతో దస్తావేజులు తయారవుతాయి. ఒక వ్యక్తి/సంస్థకి తెలియకుండా/చెప్పకుండా/ ఎరుకలో లేకుండా జరిగిన వ్యవహారం. విచారణలో నాకు తెలియదు, నేను కాదని, నాకు హక్కు లేదని ధ్రువీకరించిన కేసులు.

**కొన్ని వ్యవహారాల్లో మనిషి కల్పితం (చందమామ బేతాళ కథల్లోలాగా).**

గాభరా పడొద్దు.. వీటికీ మినహాయింపులున్నాయి. హిందూ ఉమ్మడి కుటుంబంలో కర్త కాని, సభ్యులు కాని వారి పేరు మీద ఆస్తి ఉంచుకోవచ్చు. కానీ సోర్స్ మాత్రం కుటుంబం నుంచే రావాలి. ప్రయోజనం ఉమ్మడి కుటుంబానికే చెందాలి. ట్రస్టుల్లో, భాగస్వామ్యంలో, కంపెనీల్లో, డిపాజిటరీలాగా, ఏజెంటులాగా, విశ్వాసపాత్రుడి హోదాలో వ్యవహారాలు.. కుటుంబంలో భార్యభర్తల పేరు మీద, పిల్లల పేరు మీద జరిగే వ్యవహారాలు మొదలైన వాటికి సోర్స్ కుటుంబ సభ్యుల నుంచే రావాలి. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు, అన్నాచెల్లెళ్లు, గత తరంగానీ, భవిష్యత్తు తరంగానీ, జాయింట్ ఓనర్స్...డాక్యుమెంట్ ప్రకారం ఉండి.. సోర్స్ వారిలో ఎవరి దగ్గర్నుంచైనా ఉండాలి. గుర్తుంచుకోవాల్సినది ఏమిటంటే 'సోర్స్' అంటే 'కెపాసిటీ' ఉండాలి. నిజమైన వ్యవహారం అయి ఉండాలి. డమ్మీలుండకూడదు.

**మరి కొన్ని ఉదాహరణలు గమనించండి..**

'అ' అనే అన్నగారు ఒక ఇల్లు కొన్నారు. తానే డబ్బు ఇచ్చారు. కానీ 'ఆ' అనే వదిన గారి పేరు మీద రిజిస్ట్రేషన్ జరిగింది. 'అ' ఆ ఇంట్లోనే ఉంటారు. ఈ కేసులో 'ఆ' బినామీదారు. 'అ' ప్రయోజనం పొందిన వ్యక్తి. ఇక మరో కేసు. ఇది వింటే 'మత్తు' వదిలిపోతుంది. 'పీ' అనే వ్యక్తికి లిక్కర్ లైసెన్సు ఉంది. తన ఉద్యోగి 'ఖ' పేరు మీద అన్ని చెల్లింపులు. కానీ రాబడి అంతా 'పీ'దే. ఇదొక బినామీ వ్యవహారం. బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కల్పిత పేర్లతో, లేనివారి పేరు మీద, మరణించిన వారి పేరుతో మీద పెడతారు. ఇదీ బినామీయే. ఉద్యోగస్తుల పేరు మీద బ్యాంకు లాకర్లు తెరిచి అందులో నగదు, బంగారం పెట్టడం, అలాగే బంధువుల పేరు మీద వ్యవహారాలు చేయడం.. ఇటువంటి వ్యవహారాల్లో బేతాళ కథల్లోని కల్పిత వ్యక్తి ... బినామీదారు. తన గుట్టు చెప్పకుండా ప్రయోజనం పొందే వ్యక్తి, ప్రయోజనం పొందిన వ్యక్తిని ఈ పేరుతో వ్యవహరిస్తారు. ఈ వ్యవహారాలు/ఆస్తులు, ఇందులోని సూత్రధారులు అందరూ శిక్షార్హులే! "బినామీ వ్యవహారాలకు దూరంగా ఉండండి" అని డిపార్టుమెంటు వారు జారీ చేసిన కరపత్రాలు చదవండి. బినామీ అంటే సునామీ లాంటిది.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

## ట్రంప్ 2.0.. ఏడాదిలో వచ్చిన ఆర్థిక మార్పులు

అమెరికా ఓవల్ ఆఫీస్‌లో రెండోసారి అడుగుపెట్టిన మొదటి రోజు నుంచే కీలక నిర్ణయాలు తీసుకున్న డొనాల్డ్ ట్రంప్.. గడిచిన 365 రోజుల్లో తన 'ట్రంపరితనాన్ని' చూపిస్తూనే ఉన్నారు. అమెరికా ఫస్ట్ అనే మంత్రాన్ని జపిస్తూ శరవేగంగా వెలువడుతున్న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ప్రపంచ దేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. చైనాతో టారిఫ్‌ల యుద్ధం, అక్రమ వలసలపై ఉక్కుపాదం, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌తో కలిసి డోజ్ (DOGE) ద్వారా ప్రభుత్వ ప్రక్షాళన.. ఇలా ప్రతి అడుగులోనూ ట్రంప్ దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది పొడవునా సాగిన ఈ సంచలన నిర్ణయాల తుపాను ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ముద్ర వేసింది? జీడీపీ లెక్కలు, ఏఐ బూమ్ వెనుక దాగిన మార్కెట్ వాల్యుయేషన్లు ట్రంప్‌నకు విజయ కేతనం పడుతున్నాయా లేక 2026లో రాబోయే భారీ ఆర్థిక పరీక్షకు సంకేతాలు ఇస్తున్నాయా? వంటి అంశాలపై విశ్లేషణ.. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టి రేపటితో ఏడాది పూర్తవుతుంది. ఈ సంవత్సరం కాలంలో సుంకాలు, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (DOGE), కృత్రిమ మేధ (ఏఐ)లో భారీ పెట్టుబడుల వంటి నిర్ణయాలతో వైట్‌హౌస్ నిరంతరం వార్తల్లో నిలిచింది. రాజకీయంగా పెను మార్పులు చోటుచేసుకున్న ఈ ఏడాది ఆర్థికంగా కూడా మిశ్రమ ఫలితాలను అందించింది.

**ఆరంభంలో సంకోచం.. ఆపై..**

ట్రంప్ పాలన 2025 ప్రారంభంలో కొంత ఒడిదుడుకులతో సాగింది. 2025 మొదటి త్రైమాసికంలో అమెరికా జీడీపీ 0.6 శాతం క్షీణించింది. 2022 తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇలా వెనకబడటం ఇదే తొలిసారి. అయితే, ఆ తర్వాత పరిణామాలు వేగంగా మారాయి. రెండో త్రైమాసికంలో 3.8 శాతం, మూడో త్రైమాసికంలో 4.3 శాతం వృద్ధి నమోదై ఆర్థిక వ్యవస్థ మళ్లీ పట్టాలెక్కింది. వినియోగదారుల ఖర్చు పెరగడం, ఎగుమతులు పుంజుకోవడం, దిగుమతుల్లో తగ్గుదల ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

**ద్రవ్యోల్బణం, ఉద్యోగాల సవాలు**

ద్రవ్యోల్బణం నియంత్రణలోనే ఉన్నట్లు కనిపిస్తోంది. పీసీఈ (PCE) ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 2.8 శాతంగా ఉండగా, డిసెంబర్ నాటికి 2.7 శాతానికి తగ్గింది. సుంకాల వల్ల ధరలు భారీగా పెరుగుతాయన్న ఆందోళనలు ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి అటువంటి నాటకీయ మార్పులు కనిపించలేదు. కానీ, ఉద్యోగ మార్కెట్ ఆందోళన కలిగిస్తోంది. యూఎస్‌లో నిరుద్యోగ రేటు 2025 నవంబర్‌లో 4.5 శాతానికి చేరింది. 2025లో నెలకు సగటున కేవలం 49 వేల ఉద్యోగాలు మాత్రమే జోడయ్యాయి. ఇది గడిచిన ఏడేళ్ల సగటు (1.41 లక్షలు) కంటే చాలా తక్కువ. బిగ్ టెక్ సంస్థల్లో కొనసాగుతున్న లేఆఫ్స్ దీనికి ప్రధాన కారణం.

**అమెరికా కంటే ప్రపంచమే ముందంజ**

ట్రంప్ 2.0 తొలి ఏడాదిలో అమెరికా మార్కెట్లు లాభాలను పంచాయి. గడిచిన ఏడాదిలో..

**ఎస్ అండ్ పీ 500: +16%**

**నాస్‌డాక్: +20%**

**డౌ జోన్స్: +14%**


ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా మార్కెట్ల జోరు తక్కువగానే ఉంది. జపాన్ నిక్కీ (40%), కొరియా కోస్పి (92%), హాంగ్ సెంగ్ (37%) వంటి అంతర్జాతీయ సూచీలు అమెరికాను మించిపోయాయి. డాలర్ ఇండెక్స్ 9.3 శాతం పడిపోవడం, బంగారం ధరలు అనూహ్యంగా పెరగడం ఈ ఏడాది విశేషం.

**ఏఐ బూమ్**

ట్రంప్ హయాంలో ఏఐ రంగానికి పెద్దపీట వేశారు. ముఖ్యంగా 'స్టార్‌గేట్' వంటి 500 బిలియన్ డాలర్ల మెగా ప్రాజెక్టులు టెక్ రంగాన్ని ఉత్సాహపరిచాయి. ఆల్ఫాబెట్, ఎన్విడియా వంటి 'మాగ్7' స్టాక్స్ మార్కెట్ విలువలో 20 శాతం వృద్ధి సాధించాయి. ప్రస్తుతం ఎస్ అండ్ పీ 500లో 42 శాతం వాటా కేవలం ఏఐ అనుబంధ కంపెనీలదే ఉండటం గమనార్హం.

**అసలైన పరీక్ష ముందే?**

ప్రస్తుతం అమెరికా మార్కెట్లు 28 రెట్ల పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్ ఉదాహరణకు.. కంపెనీ రేషియో 20 ఉంటే ఆ కంపెనీ సంపాదించే 1 రూపాయి లాభం కోసం 20 రూపాయలు చెల్లిస్తున్నారని అర్థం) వద్ద ట్రేడవుతున్నాయి. ఇది 2000 నాటి డాట్‌కామ్ బబుల్ స్థాయిని గుర్తుచేస్తోంది. 2026లో వడ్డీ రేట్ల నిర్ణయాలు, ఫెడ్ రిజర్వ్ వైఖరి, సుంకాల దీర్ఘకాలిక ప్రభావం అమెరికా ఆర్థిక స్థితిని నిర్ణయించనున్నాయి. రికార్డు స్థాయి స్టాక్ మార్కెట్లపై ట్రంప్ గర్వపడుతున్నా పెరుగుతున్న రుణాలు, మార్కెట్ వాల్యుయేషన్ల మధ్య ఈ ఏఐ బూమ్ ఎంతకాలం నిలుస్తుందనేది వేచి చూడాలి.



## అమెరికాలో.. స్వేచ్ఛకు తూట్లు..! పెరుగుతున్న పేదరికం..!!

**వాషింగ్టన్ డీసీ:** 'అందమైన లోకమని.. రంగురంగులుంటాయని.. అందరూ అంటుంటారు రామరామ.. అంత అందమైంది కానేకాదు చెల్లెమ్మా' అని సినీకవి అన్న మాటలు అగ్రరాజ్యం అమెరికాకు సరిగ్గా నప్పుతాయి..! స్వేచ్ఛాసమానత్వాల భూమిగా అమెరికా గడ్డకు పేరుంది. కానీ, ఆ పేరు వెనక విరోధ భావాలు కూడా ఉన్నాయి. అణచివేత ధోరణులూ ఉన్నాయి. మరో కోణంలో అమెరికాను చూస్తే.. విస్తుపోయే నిజాలు కనిపిస్తాయి. డొనాల్డ్ ట్రంప్ ఏడాది పాలన నేపథ్యంలో.. 'అమెరికా మరో పార్శ్వం'పై స్పెషల్ రిపోర్ట్.. గన్‌కల్చర్‌కు అమెరికా పెట్టింది పేరు..! ఎప్పుడు ఏ బడిలో తూటా పేలుతుందో తెలియదు..! ఎప్పుడు ఏ పబ్లిక్ ఈవెంట్‌పై ఉన్మాదుల తుపాకీ గర్జిస్తుందో ఊహించలేం..! మనుషుల కంటే తుపాకులే ఎక్కువ సంఖ్యలో ఉన్న దేశం అమెరికా. విద్యార్థులు పరీక్షలకు కాకుండా.. గన్ షూటింగ్‌కు సన్నద్ధమవుతుంటారు. తొమ్మిది.. పదేళ్ల వయసులోనే బ్యాగులో తుపాకీ తెచ్చుకుని, కోపంతో టీచర్లు, తోటి విద్యార్థులపై గురిపెడతారు. 33.5 కోట్ల జనాభాకు 40 కోట్ల గన్స్ ఉండడం పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోంది. 2024లో తుపాకీ తూటాలకు 40 వేల మంది బలవ్వగా.. వారిలో 1,200 మంది చిన్నపిల్లలున్నారు. అమెరికాలో తల్లిదండ్రులు ఏకంగా తమ పిల్లలకు బుల్లెట్ ప్రూఫ్ బ్యాగులు, దుస్తులు కొనే పరిస్థితి అక్కడ నెలకొంది. తుపాకీ కారణంగా అమెరికాలో పౌరులు బిక్కుబిక్కుమంటూ గడిపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడి పౌరులకు స్వేచ్ఛ ఉన్నట్లా..? లేనట్లా..? స్వేచ్ఛావాయువులు అమెరికాలో బలంగా వీస్తాయంటారు. ఇంకా చెప్పాలంటే.. ఫలానా దేశంలో స్వేచ్ఛలేదంటూ రిపోర్టులిచ్చే ఎన్నెన్నో ఏజెన్సీలకు అమెరికా ఆలవాలం. ఫలానా దేశంలో ఫలానా మతస్థులను ఊచకోత కోస్తున్నారంటూ గగ్గోలు పెట్టే మీడియా అమెరికాకు సొంతం. అయితే.. ఇదంతా గురివింద చందమే..! అమెరికాలో జాతి వివక్ష ఏమాత్రం తగ్గ లేదు. ఇంకా చెప్పాలంటే.. అమెరికా జైళ్లలో ఉంటున్న ఖైదీల్లో శ్వేత జాతీయుల కంటే.. నల్ల జాతీయుల సంఖ్య ఐదు రెట్లు అధికంగా ఉంటోంది. అమెరికాలో జీఈ, న్యూస్ కార్ప్, డిస్నీ, వియాకామ్, టైమ్ వార్నర్, సీబీఎస్ అనే ఆరు సంస్థల చేతుల్లో 90% మీడియా ఉంది. ఈ సంస్థలేవీ అమెరికాలో జరుగుతున్న జాతి వివక్షను బయటి ప్రపంచానికి చూపించవు. కానీ, భారత్ లాంటి దేశాల్లో స్వేచ్ఛ లేదంటూ గగ్గోలు పెడతాయి. అమెరికా జైళ్లలో రెండు మిలియన్ల ఖైదీలుండగా.. వీరిలో సింహభాగం శ్వేతజాతీయులు కాని వారే. 21 లక్షల మంది జైళ్లలో మగ్గుతున్నారు. వీరితో జైళ్లలో బండ చాకిరీ చేయించుకుని, ముష్టి పారేసినట్లు గంటకు 25 సెంట్ల చొప్పున కూలీ ఇస్తారు.


అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కడో స్లమ్‌లలో పరిస్థితులను భూతద్దంలో చూపించే అమెరికా మీడియా.. ఆయా దేశాల్లో పేదరికం పేట్రేగుతోందని, ప్రజలు కూడు, గూడు, గుడ్డకు నోచుకోవడం లేదని చూపడం సహజమే..! అయితే.. అమెరికాలో అంతా సంపన్నులే ఉన్నారా? పేదలే లేరా? అనే ప్రశ్నకు పాశ్చాత్య మీడియా కూడా నోరు మెదపదు. నిజమేంటంటే.. అమెరికాలో 18శాతం మంది పౌరులు నిరాశ్రయులు. ఆరున్నర లక్షల మంది పౌరులు వంతెనల కింద, రోడ్లపైనే నిద్రిస్తుంటారు. సైనికులు ఏర్పాటు చేసే టెంట్లలో 40 వేల మంది నిద్రిస్తారని అంచనా..! ఇక లాస్ ఏంజిల్స్, సాన్ ఫ్రాన్సిస్కో, సియాటిల్ ప్రాంతాల్లో ఏకంగా 'టెంట్ సిటీస్' పేరుతో పేదల బస్తీలు పుట్టుకొస్తున్నాయి. అదే సమయంలో.. బిలియనీర్ల సంపద ఒక్క కొవిడ్ సమయంలోనే 2 ట్రిలియన్ డాలర్ల మేర పెరగడం గమనార్హం..!

ఏటా వైద్యంపై 4.5 ట్రిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నామని అమెరికా గొప్పలు చెప్పుకొంటోంది. అయితే.. అనారోగ్యంతో సరైన వైద్యం అందక అమెరికాలో చనిపోతున్న వారి ఏటా 50 వేల మంది చనిపోతున్నట్లు ఓ నివేదిక ఉంది. అమెరికా అంటేనే వైద్య బీమా తప్పనిసరి అంటారు. అది కేవలం ఇమిగ్రెంట్లకేనని తెలుస్తోంది. ఇప్పటికీ అమెరికాలో 2 కోట్ల 70 లక్షల మంది పౌరులకు బీమా అందడం లేదని, ఐదు లక్షల కుటుంబాలు వైద్య ఖర్చుల కారణంగా దివాళా తీస్తున్నాయని పలు నివేదికలు వచ్చాయి. వైద్యం ప్రాథమిక హక్కు అని చెప్పుకొనే అమెరికాలో ఒక సర్జరీ కాస్ట్ 50 వేల డాలర్లుగా.. అంబులెన్స్ చార్జీలు కనీసం రెండు వేల డాలర్లుగా ఉండడం గమనార్హం..! అంటే.. అమెరికాలో రోగి ప్రాణాన్ని ధనమే నిర్ణయిస్తుందని స్పష్టమవుతోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పుడు అమెరికాలో ధరాభారం పెరిగింది. అమెరికాలో ఒక సగటు ఉద్యోగి జీతం తీసుకుని ఒక్కరోజు గడవక ముందే.. మళ్లీ జీతం రావడానికి ఎన్నిరోజులు ఉందా? అని లెక్కలేసుకుంటున్నాడు. ఈ కోవలో 60శాతం మంది ఉద్యోగులు ఉన్నట్లు ఓ అధ్యయనం చెబుతోంది. ఇళ్ల ధరలు, అద్దెలు, విద్య, వైద్యం, నిత్యావసరాలు.. ఇలా అన్నీ చుక్కలనంటుతున్నాయి. దిగుమతులపై ట్రంప్ టారిఫ్‌లతో ధరలు పెరిగి, అమెరికా పౌరులు విలవిల్లాడుతున్నారు. వేతనాలు పెరగవు.. ధరలు తగ్గవు అంటూ నిట్టూరుస్తున్నారు. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎన్నికల వ్యవస్థపై అభాండాలు వేసే అమెరికాలో.. ఎన్నికలు కూడా అత్యంత ఖరీదుతో కూడుకున్నవే..! ట్రంప్ విజయం సాధించిన 2024 ఎన్నికలు అమెరికా చరిత్రలోనే అత్యంత ఖరీదైనవిగా నిలిచిపోయాయి. ఇందుకు 16 బిలియన్ డాలర్ల మేర ఖర్చయిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఖర్చులో కార్పొరేట్ కంపెనీల విరాళాలు కూడా ఉంటాయి. ఫలితంగా ఆయా సంస్థలు తమకు అనుకూల చట్టాలు తెప్పించుకుంటాయి. నేతల స్టాక్ పోర్ట్‌ఫోలియోలు కూడా విమర్శలకు తావిస్తున్నాయి. 2023లో 50 మంది నేతలు ఈ తరహాలో వ్యాపారం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఇక అమెరికాలో ట్రంప్ వంటి పాలకుల కారణంగా.. పౌరుల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. ప్రతి ఐదుగురిలో ఒకరు ఏదో ఒక రకమైన మానసిక రుగ్మతను ఎదుర్కొంటున్నట్లు అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ సైకియాట్రీ చెబుతుంగా.. ఈ కారణాలతో 15 - 34 ఏజ్ గ్రూప్ వారిలోనే ఎక్కువగా ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయి. ఒంటరితనం, ఒత్తిడి, డ్రగ్స్ వంటివి ఈ ఆత్మహత్యలకు కారణాలుగా తెలుస్తోంది.



# సైన్స్ ఫిక్షన్‌లో..

'లవ్ టుడే', 'డ్రాగన్' (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'), 'డ్యూడ్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు దర్శక–నటుడు ప్రదీప్ రంగనాథన్. తాజాగా ప్రదీప్ ఓ సైన్స్ ఫిక్షన్ కథను రెడీ చేశారు. ఈ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలని అనుకుంటున్నారు. ఈ సినిమాలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు ప్రదీప్. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రంలోని నటీనటుల ఎంపికపై ప్రదీప్ దృష్టి పెట్టారట. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉందని, ఒక హీరోయిన్‌గా శ్రీలీల నటించనున్నారని, మరో హీరోయిన్‌గా మీనాక్షీ చౌదరి కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఆల్రెడీ ఈ సినిమా కథను శ్రీలీల, మీనాక్షీలకు ప్రదీప్ వినిపించారని సమాచారం మరి... ఈ సైన్స్ ఫిక్షన్స్ సినిమాకు శ్రీలీల, మీనాక్షీ చౌదరి 'సై' అన్నారా? లేదా అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.






# పూజాని ఇబ్బంది పెట్టిన పాన్ ఇండియా హీరో ఎవరు?

హీరోయిన్ పూజా హెగ్డేకి అవకాశాలు దాదాపు తగ్గిపోయాయి. ఈమె నటించిన 'జన నాయగణ్' లెక్క ప్రకారం ఈ పాటికే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి వచ్చేయాలి. కానీ సెన్సార్ సమస్యల వల్ల అది ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ఇలాంటి టైంలో పూజా హెగ్డే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయిపోయింది. దానికి కారణం ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలు. పాన్ ఇండియా హీరో తనతో అసభ్యంగా ప్రవర్తిస్తే, అతడిని లాగిపెట్టి కొట్టానని చెప్పంది. ఇంతకీ ఏంటి విషయం?


తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా హెగ్డే.. ఓ స్టార్ హీరోతో తనకెదురైన ఓ చేదు అనుభవాన్ని బయటపెట్టింది. 'నా కెరీర్ మొదట్లో ఓ భారీ పాన్ ఇండియా సినిమాలో ఛాన్స్ వచ్చింది. చాలా సంతోషంగా అనిపించింది. కానీ షూటింగ్ టైంలో ఓ రోజు.. ఆ హీరో, అనుమతి లేకుండా నా క్యారవాన్‌లోకి వచ్చేశాడు. అసభ్యంగానూ ప్రవర్తించాడు. చాలా ఇబ్బందిగా అనిపించింది. ఏం చేయాలో అర్థం కాలేదు. దీంతో ఆ హీరోని లాగిపెట్టి కొట్టాను. వెంటనే సదరు హీరో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత ఆ హీరోతో నటించడానికి నేను ఇష్టపడలేదు. దీంతో నా సీన్స్ అన్నీ డూపుని పెట్టి తీశారు' అని పూజ చెప్పుకొచ్చింది.

మరి పూజా హెగ్డేని ఇబ్బంది పెట్టిన ఆ పాన్ ఇండియా హీరో ఎవరా అనేది ఇక్కడ క్వశ్చన్ మార్క్. కెరీర్ ప్రారంభంలో అంటే హృతిక్ రోషన్ 'మొహంజదారో'లో ఈమె నటించింది. దక్షిణాదిలోనూ ఈ మూవీ రిలీజైంది. నాలుగేళ్ల క్రితం ప్రభాస్ 'రాధేశ్యామ్'లో నటించింది. పూజా చేసిన పాన్ ఇండియా మూవీస్ అంటే ఇవే. మరి వీరిద్దరిలో ఎవరైనా పూజతో అసభ్యంగా ప్రవర్తించారా? లేదంటే ఈమె ఏమైనా కట్టుకథ చెబుతోందా అనేది ఇక్కడ అర్థం కావట్లేదు. ఇకపోతే పూజా చేతిలో ప్రస్తుతం కాంచన 4, దుల్కర్ సల్మాన్ తెలుగు సినిమా, ఓ హిందీ మూవీ ఉన్నాయి.

## దోమకాటుతో లక్షలమంది చనిపోతున్నారు.. వాళ్లవి ప్రాణాలు కాదా?



హీరో పవన్ కల్యాణ్ మాజీ సతీమణి రేణు దేశాయ్ మీడియా ముందుకొచ్చారు. వీధి కుక్కల్ని చంపేస్తున్న వాళ్లపై మండిపడ్డారు. రీసెంట్‌గా వీధి కుక్కల బెడదని అరికట్టేందుకు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగానే రేణు దేశాయ్ ప్రెస్ మీట్ పెట్టారు. దోమకాటుతో ఏడాదికి 10 లక్షల మంది చనిపోతున్నారు. వాళ్లవి ప్రాణాలు కాదా? కుక్క కరిచి ఒక్కరు చనిపోతే అది మాత్రమే ప్రాణమా? అని ప్రశ్నించారు. అలానే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అన్యాయంగా కుక్కల్ని చంపితే కర్మ మిమ్మల్ని వదిలిపెట్టదు. కుక్కలన్నీ మంచివే అని నేను చెప్పను. కుక్కల దాడిలో చిన్న బిడ్డలు చనిపోయారు. ఒక తల్లిగా ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఐదు కుక్కలు కరిస్తే మిగతా కుక్కలన్నింటినీ చంపేస్తారా? మగాళ్లు రేప్ చేస్తారు, మగాళ్లే మర్డర్లు కూడా చేస్తారు. అంతమాత్రాన మగాళ్లందర్నీ రేపిస్టులు, హంతకులు అంటామా? రేపులు, మర్డర్లు చేసిన మగాళ్లందర్నీ పట్టుకుని చంపేయాలా? బుద్ధి ఉందా కొంచెమైనా? ఏడాదికి దోమకాటుతో 10 లక్షల మంది చనిపోతున్నారు. వాళ్లవి ప్రాణాలు కాదా? కేవలం కుక్క కరిచి ఒక్కరు చనిపోతే అది మాత్రమే ప్రాణమా?' అని రేణు దేశాయ్ ప్రశ్నించారు. మీలో ఎంత మంది అనాథ ఆశ్రమానికి వెళ్లారు? ఎంత మంది అన్నదానం చేస్తున్నారు? ఎంత మంది అనాథ పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు? చేసేది ఏమీ లేదు.. పెద్ద పెద్ద మాటలు మాత్రం మాట్లాడతారు? అని రేణు దేశాయ్ రెచ్చిపోయింది. దేశంలో చాలా సమస్యలు ఉన్నాయి. రోడ్డుపై అడ్డదిడ్డంగా వైన్ షాప్స్ పెడతారు. ఆల్కహాల్ తాగొచ్చి చాలామంది చిన్నపిల్లల్ని చావులకు కారణమవుతున్నారు. వాటి గురించి ఎవరూ ఎందుకు మాట్లాడటం లేదు. చిన్నారుల జీవితానికి విలువ లేదా? కుక్క కరిస్తేనే అడుగుతారా? లక్షలాది మంది ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక చనిపోతున్నారు. దానికోసం ఎవరూ పోరాడటం లేదు? కుక్కలు కరిస్తేనే పోరాటాలు చేస్తున్నారు అని ఆవేశానికి లోనైంది. ప్రతిరోజూ తాను ఎన్నో కుక్కలని కాపాడుతున్నానని.. అంబులెన్సులు వచ్చి వాటి తీసుకెళ్తున్నాయని.. వాటి కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నానని రేణు దేశాయ్ చెప్పారు. కుక్కలు ఇప్పటికే రోజూ యాక్సిడెంట్స్ చాలా చనిపోతున్నాయి. బైక్, బస్, కార్ల వల్ల జరిగే ప్రమాదాల వల్ల కాళ్లు, నడుము విరిగిన కుక్కల్ని చాలాసార్లు కాపాడాను. వాహనదారుల వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని కుక్కలు వెళ్లి కంప్లైంట్ చేయలేవుగా అని ప్రశ్నించారు.



# నేను విన్న కథ వేరు.. చేసిన సినిమా వేరు!

గతేడాది తిరుగులేని కథానాయికగా పేరు తెచ్చుకుంది రష్మిక మందన్నా. ఛావా, కుబేర, థామా, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో సూపర్ హిట్లు, బ్లాక్‌బస్టర్లు అందుకుంది. 2025లో ఆమె నటించిన అన్ని సినిమాలు విజయాలు సాధిస్తే.. ఒకే ఒక మూవీ మాత్రం బాక్సాఫీస్ వద డిజాస్టర్‌గా నిలిచింది. అదే సికందర్. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటించాడు.

### గతేడాది ఒక్కటే ఫ్లాప్

తమిళ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహించాడు. గతేడాది మార్చిలో విడుదలైన ఈ చిత్రం బడ్జెట్ కూడా రాబట్టలేకపోయింది. హీరో సమయానికి సెట్‌కు వచ్చేవాడు కాని, అందుకే సినిమా పోయింని మురుగాస్ సల్మాన్‌ను విమర్శించాడు. దాంతో ఆ హీరో కూడా దర్శకుడికి రివర్స్ కౌంటర్లిచ్చాడు. తాజాగా సికందర్ మూవీ గురించి రష్మిక స్పందించింది.

### నాకు చెప్పిన కథ వేరు

తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సికందర్ కథ నాకు చెప్పినప్పుడు ఒకలా ఉంది. తర్వాత మొత్తం మారిపోయింది. సాధారణంగా ఇది సినిమాల్లో జరుగుతూనే ఉంటుంది. మొదట కథ ఒకటి చెప్తారు.. సినిమా తీసే క్రమంలో.. పర్ఫామెన్స్, రిలీజ్ డేట్, ఎడిటింగ్.. వీటన్నింటి మూలంగా అన్నీ మారిపోతూ ఉంటాయి. సికందర్ విషయంలో కూడా అదే జరిగింది అని చెప్పుకొచ్చింది.



# 20 ఏళ్ల వయసులోనే అలాంటి అనుభవం!

సెలబ్రిటీల జీవితం అద్దాల మేడలాంటిదంటారు. నిజమే, ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత వారిది ఆడంబర జీవితమే.. అయితే ఆ స్థాయికి ఎదిగేవరకు ఎన్నో చేదు అనుభవాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలా తమ జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను చాలామంది నటీమణులు బహిరంగంగానే వెల్లడించిన సందర్భాలున్నాయి. హీరోయిన్ తమన్నా కూడా ఇందుకు అతీతం కాదు.

### బాలీవుడ్‌లో బిజీ

ఒక్క పాటకు డ్యాన్స్ చేయడానికి సుమారు రూ.6 కోట్లు పారితోషికం తీసుకుంటున్న ఈ అందాల రాశి 2 దశాబ్దాలుగా పలు భాషల్లో హీరోయిన్‌గా రాణిస్తోంది. ముఖ్యంగా ఐటం సాంగ్స్‌లో తన ప్రత్యేకతను చాటుకుంటున్న తమన్నాకు ప్రస్తుతం దక్షిణాదిలో పెద్దగా అవకాశాలు లేకపోయినా హిందీలో చేతినిండా సినిమాలతో బిజీగానే ఉంది.

### దర్శకుడు ఒత్తిడి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ 20 ఏళ్ల వయసులోనే చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నట్లు పేర్కొంది. ఒక సినిమాలోని ఓ సీన్‌లో హీరోతో కలిసి చాలా సన్నిహితంగా నటించాలని దర్శకుడు ఒత్తిడి చేశాడంది. అయితే ఆ సీన్‌లో నటించేందుకు తనకు అసౌకర్యంగా ఉందని చెప్పి నిరాకరించానంది.

### హీరోయిన్‌ను మార్చండి

దీంతో సెట్‌లో అందరూ ఉండగా హీరోయిన్‌ను మార్చండి అని ఆ దర్శకుడు గట్టిగా అరిచాడంది. అలా ఆ సన్నివేశంలో నటించాల్సిందేనని దర్శకుడు పట్టుబట్టడంతో తాను తగ్గకుండా ఏం జరిగినా పర్వాలేదు అనే నిర్ణయానికి వచ్చానని చెప్పింది. చివరకు ఆ దర్శకుడు క్షమాపణ చెప్పారంది. అయితే అది ఏ సినిమా? ఆ దర్శకుడు ఎవరు? అన్న విషయాలు మాత్రం బయటపెట్టలేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com